PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 178 | విజయవాడ, శుక్రవారం 2 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 2 February 2024 | Rs

సబ్సిడీలకు కోత

- ఆహారం, గ్యాస్, పెట్రోల్, యూరియా వంటి ఎరువులకు తగ్గిన కేటాయింపులు
- ఐసిడిఎస్, పంటల బీమాకు కోత
- ఉపాధి హామీ, పిఎం కిసాన్‌కు పెంపు లేదు

8

ముఖ్యాంశాలు



- వ్యవసాయ రంగంలో పెరగనున్న ప్రైవేటీకరణ జోరు
- ఆదాయపు పన్ను యథాతథం, వేతన జీవులకు నిరాశే
- అణగారిన వర్గాలకుద్దేశించిన ముఖ్యమైన పథకాలకు నిధుల కోత
- గర్భాశయ క్యాన్సర్ నివారణకు వ్యాక్సినేషన్
- కోటి కుటుంబాలకు 300 యూనిట్ల ఉచిత సౌర విద్యుత్
- అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఆయుష్మాన్ పథకం
- మూడు కొత్త రైల్వే కారిడార్లు.
- విద్య, ఆరోగ్య రంగాల కేటాయింపుల కుదింపు
- రాష్ట్రాలకు నిధుల బదలాయింపులో కోత

ఎన్నికల ఏడాదిలోనూ

కార్పొరేట్ల వికాసమే



మోడీ ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ నిండా సంస్కరణల జపమే

- సామాన్యులకు తప్పని విషాదం
- కీలక సబ్సిడీలకు కోతలు
- ఆర్భాటంగా సాగిన ఆర్థిక మంత్రి ప్రసంగం

ఎన్నికల ఏడాదిలోనూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల వైపే చూసింది. 2047వ సంవత్సరానికి వికసిత్ భారత్ లక్ష్యమంటూ ఆర్భాటంగా సాగిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పేదలకు పెనుభారంగా మారిన ఆర్థిక సంస్కరణల చుట్టూ తిరిగింది. 2024-25 సంవత్సరానికి రూ.47.65 లక్షల కోట్ల అంచనాతో గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ మధ్యంతర బడ్జెట్‌లో మలితరం సంస్కరణలను ప్రారంభించనున్నట్లు మంత్రి అట్టహాసంగా ప్రకటించారు. 'రీఫామ్, పర్ఫామ్, ట్రాన్స్‌ఫాం' పద్ధతిలో వీటిని మరింత సమర్ధవంతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ దిశలో అడుగులు వేసే రాష్ట్రాల కోసం రూ.75 వేలకోట్లను కేటాయించారు. 50 ఏళ్ల కాల వ్యవధితో వడ్డీలేని రుణాన్ని సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు ఇస్తామని ప్రకటించారు. వ్యవసాయంలోనూ ప్రైవేటుకు పెద్దపీట వేస్తామని చెప్పారు. గతేడాది ప్రకటించిన కార్పొరేట్ ట్యాక్స్ రాయితీని కొనసాగించడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వారికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా మధ్యంతర బడ్జెట్ సాగింది. అదే సమయంలో ఉపాధిహామీ చట్టంతో పాటు, అణగారిన వర్గాలకు ఉద్దేశించిన ముఖ్యమైన పథకాలకు ఎడాపెడా కోతపెట్టారు. ఆహారం, ఎరువులు, పంటలబీమా, గ్యాస్ వంటి వివిధ పథకాలకు ఇచ్చే సబ్సిడీలను కుదించారు. విద్య, వైద్య రంగాల పరిస్థితి అదే! ఆదాయపన్ను రేట్లలో సడలింపులు ఆశించిన వేతన జీవులకు నిరాశే మిగిల్చారు. మహిళల రక్షణకు ఉద్దేశించిన పథకాల నిధులూ తగ్గిపోయాయి. అంగన్‌వాడీలతో పాటు పోషణ్ అభియాన్ పథకపు నిధుల్లోనూ కోత పెట్టారు. అధిక ధరలు, పెరుగుతున్న నిరుద్యోగాన్ని అదుపు చేసేందుకు చర్యలు చేపట్టడానికి బదులుగా మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఈ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా వరుసగా ఆరోసారి బడ్జెట్ ప్రతులను పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఘనతను నిర్మలా సీతారామన్ దక్కించుకున్నారు.

(వివరాలు లోపల పేజీల్లో)

ధనవంతులను మరింత ధనికులను చేసి

పేదలను పీల్చిపిప్పి చేసే బడ్జెట్

సిపిఐ(ఎం)పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 సంవత్సరానికి గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ధనికులను మరింత ధనికులుగా చేసి, పేదలను పీల్చి పిప్పి చేసేదిగా ఉందని సిపిఐ(ఎం) విమర్శించింది. పార్టీ పొలిట్‌బ్యూరో ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది.

భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్య పరిస్థితి గురించి కేంద్ర ఆర్థిక మంత్రి గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ.. దేశం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని మధ్యంతర బడ్జెట్ వెల్లడిస్తున్నదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. దేశంలోని శ్రామిక ప్రజానీకం ఎదుర్కొంటున్న దుర్భర ఆర్థిక పరిస్థితులను ఇది వెల్లడించింది. అలాగే ధనికులను మరింత ధనవంతులుగా చేసి, పేదలను మరింత పేదలుగా మార్చే మోడీ మార్క్ 'అభివృద్ధి' నమూనాను ఇది కళ్లకు కడుతున్నదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. దేశంలోని కొద్ది మంది లాభాలను గరిష్టంగా పెంచడానికి వీలుగా అపార కార్మిక వర్గం జీవనోపాధులను పీల్చి పిప్పి చేస్తున్న మోడీ ప్రభుత్వ దుర్మార్గపు అభివృద్ధి నమూనా అమలుకు ఈ బడ్జెట్ ప్రయత్నిస్తోందని విమర్శించింది.

2024-25 సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే మిగతా 7లో

భారత భవిష్యత్‌ను రూపొందించే బడ్జెట్ : ప్రధాని మోడీ



మధ్యంతర బడ్జెట్ అభివృద్ధి చెందిన భారతదేశ పునాదిని బలోపేతం చేసే హామీ ఇస్తోంది. యువత, పేద, మహిళలు, రైతులు అనే నాలుగు స్తంభాలకు డెవలప్డ్ ఇండియా సాధికారతనిస్తుంది. ఇది భారత భవిష్యత్‌ను రూపొందించే బడ్జెట్. ఇది యంగ్ ఇండియా యువ ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది. ఈ బడ్జెట్‌లో మొత్తం వ్యయం చారిత్రకంగా రూ.11,11,111 కోట్లకు పెరిగింది. బడ్జెట్ 21వ శతాబ్దపు ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనతోపాటు భారత్‌లోని యువతకు లక్షలాది కొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది"

అపజయాలను విజయాలుగా పేర్కొనడం వీరి ప్రత్యేకత

శశిథరూర్, కాంగ్రెస్ సీనియర్ నేత



అపజయాలను విజయాలుగా పేర్కొనడం ఈ ప్రభుత్వ ప్రత్యేకత. 2015 నుంచి ప్రజల ఆదాయాలు 50 శాతానికిపైగా తగ్గాయి. వారికి ఊరటనిచ్చే అంశం బడ్జెట్‌లో ఒక్కటీ లేదు. ఉపాధి అవకాశాలు లేక 45 శాతం యువత ఇబ్బందిపడుతుంటే దాని గురించి ఒక్క ముక్కా మాట్లాడలేదు. యుపిఎ ప్రభుత్వ హయాంలో జిడిపిలో ఎఫ్‌డిఐలు 3.6 శాతం ఉంటే ఇప్పుడు ఒక శాతం కూడా లేవు. మహిళా కార్మికుల ఉపాధి భాగస్వామ్యం క్షీణిస్తుంటే నారీశక్తి గురించి మాట్లాడుతున్నారు. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను బడ్జెట్ పూర్తిగా విస్మరించింది.

బడ్జెట్‌ను ప్రజలు తిరస్కరించారు

డిఎంకె ఎంపీ దయానిధి మారన్



మోడీ ప్రభుత్వ పాలనలో గత పదేళ్లలో ఏమీ జరగలేదు. దేశంలోని ప్రజలు ఇప్పటికే నిరాశలో ఉన్నారు. ఈ బడ్జెట్‌ను ప్రజలు తిరస్కరించారు. బ్రిడ్జి కంపెనీలకు తాయిళాలు ప్రకటించారు తప్పితే అర్హులైన వారికి కాదు.

నీటి పంపిణీకి త్రిసభ్య కమిటీ

- శ్రీశైలం, సాగర్ కృష్ణా బోర్డుకు అప్పగింత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని కృష్ణానదిపై వున్న ప్రాజెక్టులకు నీటి వాటాల పంపిణీ కోసం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసుకోవాలని రెండు రాష్ట్రాలు కృష్ణా రివర్ మేనేజ్‌మెంటు బోర్డు (కెఆర్‌ఎంబి) సమక్షంలో నిర్ణయానికి వచ్చాయి. అలాగే కీలకమైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు అంగీకరించాయి. గురువారం ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై హైదారాబాద్‌లోని జలసౌధలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జలవనరులశాఖ అధికారులతో కెఆర్‌ఎంబి సమావేశం నిర్వహించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి జనవరి 17న ఢిల్లీలో జరిపిన సమావేశానికి కొనసాగింపుగా ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కృష్ణా బోర్డు చైర్మన్ శివనందన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కృష్ణా నదిపై వున్న ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు అంగీకరించాయి. అలాగే నీటి వాటాల పంపకం కోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. దీంతో వాటాల కేటాయింపుపై త్రిసభ్య కమిటీనే తుది నిర్ణయం తీసుకోనుంది. సమావేశం అనంతరం రాష్ట్ర జలవనరులశాఖ ఇఎన్‌సి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. బోర్డు పరిధిలో వుండే మొత్తం 15 అవుట్‌లెట్‌లలో 9 తెలంగాణ, 6 ఆంధ్రప్రదేశ్‌వి ఉన్నాయని తెలిపారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కృష్ణా బోర్డుకు అవసరమైన ఆపరేషన్ సిబ్బంది కోసం ఇరు రాష్ట్రాల నుంచి స్టాఫ్ కేటాయింపు వుండాలని కోరామని తెలిపారు. నీటి వాటాల కేటాయింపుపై త్రిసభ్య కమిటీదే తుది నిర్ణయం కావాలని కోరారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రోటోకాల్ త్రిసభ్య కమిటీ అప్పుడున్న పరిస్థితుల్లో తీసుకుంటారన్నారు. మార్చి నెలలో ఎడమ ప్రధాన కాలువ కెనాల్ నుండి 2 టిఎంసిలను, కుడి ప్రధాన కాలువ నుండి 3 టిఎంసిలను కోరామని తెలిపారు. ఈ నీటి విడుదలకు ఒప్పుకున్నారన్నారు. ఏప్రిల్‌కు మరో 5 టిఎంసిలు అందుబాటులో వుంటాయని అన్నారు. ప్రాజెక్టుల ఆపరేషనల్ కోసం తెలంగాణ ఒప్పుకుందని తెలిపారు. ప్రాజెక్టుల ఆపరేటింగ్ అంతా కృష్ణా బోర్డుకు ఇచ్చినట్లు తెలంగాణ ఇఎన్‌సి మురళీధర్ ఈ సందర్భంగా అన్నారు. విద్యుత్ ప్లాంట్లపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. నీటి వాటాల కోసం కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసిందని, ఇంకా ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.



5 నుంచి అసెంబ్లీ సమావేశాలు


- నోటిఫికేషన్ విడుదల
- మూడు రోజుల్లో ముగింపు
- ఇదే సెషన్‌లో బడ్జెట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల ఐదో తేదీ నుంచి జరగనున్నాయి. ఈ మేరకు గరవ్నరు ఎస్ అబ్దుల్ నజీర్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఐదో తేదీ ఉదయం పది గంటలకు గవర్నరు ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమవుతాయని అసెంబ్లీ కార్యదర్శి పిపికె రామాచార్యులు తెలిపారు. అనంతరం జరిగే బిఎసిలో సమావేశం ఎన్నిరోజులు నిర్వహించాలనేది నిర్ణయం తీసుకుంటారు. అయితే మూడు రోజులు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ సమావేశాల్లోనే ఒటాన్ అకౌంట్ బడ్జెట్ కూడా పెట్టనున్నారు.

రాష్ట్రానికి నిరాశే

- కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల్లేవు
- వైజాగ్ స్టీల్, పోర్టులకు కోత
- విభజన హామీల ఊసేలేదు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిరాశే మిగిలింది. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలకు, కేంద్ర విద్యా సంస్థలకు ఎటువంటి కేటాయింపులు లేవు. విభజన హామీల ఊసేలేదు. పైగా వైజాగ్ స్టీల్ ప్లాంట్, విశాఖ పోర్టుకు కేటాయింపులు తగ్గించారు. గతంలో కేటాయించిన అరకొర నిధుల్లోనే, ఈసారి కోత విధించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు 2023-24 బడ్జెట్‌లో రూ.683 కోట్లు కేటాయిస్తే, 2024-25 బడ్జెట్‌లో రూ.620 కోట్లు కేటాయించారు. విశాఖ పోర్టు ట్రస్ట్‌కు 2023-24 బడ్జెట్‌లో రూ.276 కోట్లు కేటాయిస్తే, 2024-25 బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించారు. వైజాగ్ పెట్రోలియం యూనివర్సిటీకి రూ.168 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కూడా రూ.168 కోట్లు కేటాయించి, సవరించిన అంచనాల్లో దాన్ని కాస్తా రూ.90 కోట్లకు కుదించారు. సెంట్రల్ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ కి కేటాయింపులు ఏమీ లేవు. సెంట్రల్ యూనివర్సిటీకి గత బడ్జెట్‌లో రూ.112.08 కోట్లు కేటాయించగా, ఈసారి కేటాయింపులేమీ లేవు. అలాగే గిరిజన యూనివర్సిటీకి గత బడ్జెట్‌లో రూ.40.67 కోట్లు కేటాయించగా, ఈసారి ఏమీ కేటాయించలేదు. కేంద్ర విద్యా సంస్థలు ఐఐటి, ఐఐఎం, ఎన్ఐటి, ఐఐఎస్‌ఇఆర్, ట్రిపుల్ ఐటి, ఎయిమ్స్ వంటి వాటికి కేటాయింపులు లేవు. విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, దుగ్గిరాజపట్నం పోర్టు, రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం వంటి వాటికి మొండి చెయ్యే మిగిలింది. వైజాగ్, విజయవాడ మెట్రోలకు సంబంధించి బడ్జెట్‌లో ఊసేలేదు. వెనుకబడిన జిల్లాల నిధుల గురించి కనీసం ప్రస్తావనే లేదు.

విషాద బడ్జెట్ 2024

- మరోసారి వంచనకు గురైన రాష్ట్రం
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు


ఇది అభివృద్ధికర బడ్జెట్

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

2

హేమంత్ సోరేన్ కస్టడీపై తీర్పు రిజర్వ్

- నేడు సుప్రీం విచారణ
- గవర్నర్‌ను మళ్లీ కలిసిన చంపాయ్ సోరేన్
- ప్రమాణస్వీకారంలో ఆలస్యమెందుకు?
- జార్ఖండ్ గవర్నర్‌పై ప్రతిపక్షాల మండిపాటు



రాజ్‌భవన్ వద్ద గవర్నరు పిలుపు కోసం వేచిచూస్తున్న చంపాయ్ సోరేన్

రాంచీ : తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు విచారించనుంది. పది రోజుల పాటు కస్టడీకి అప్పగించాలనే ఇడి అభ్యర్థనపై రాంచీలోని పిఎంఎల్‌ఎ కోర్టు గురువారం తీర్పు రిజర్వ్ చేసింది. దీంతో గురువారం ఆయన్ను ఇక్కడి హోత్వార్ సెంట్రల్ జైలుకు తరలించారు. సోరేన్‌ను కోర్టు ముందుకు శుక్రవారం మరోసారి తీసుకురానున్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తరువాత హేమంత్‌ను బుధశారం రాత్రి ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. బుధవారం ఏడు గంటలకు పైగా సోరేన్‌ను ఇడి విచారించింది. అవినీతి చర్యలు, అధికారాన్ని దుర్వినియోగం పర్చడం ద్వారా రాంచీలో సుమారు 8.5 ఎకరాల భూమి, ఇతర ఆస్తులను సంపాదించారని ఇడి ఆరోపిస్తోంది.

గవర్నర్‌ను కలిసిన చంపాయ్ సోరేన్

జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను జెఎంఎం శాసనసభా పక్ష నేత చంపాయ్ సోరేర్ బుధవారం సాయంత్రం 5 గంటలకు రాజభవన్‌లో కలిశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. జార్ఖండ్‌లో గత 18 గంటల నుంచి ప్రభుత్వం లేదని, ప్రభుత్వ ఏర్పాటు చేయడంలో జాప్యం చేయవద్దని కోరారు. హేమంత్ సోరేన్ తరువాత లెజిస్లేచర్ పార్టీ నేతగా జెఎంఎం ఎమ్మెల్యేలు చంపాయ్‌ను ఎన్నుకున్న సంగతి తెలిసిందే. గవర్నర్‌ను కలిసిన సమయంలో చంపాయ్ వెంట కాంగ్రెస్ శాససభా పక్ష నేత అలంగీర్ ఆలం, ఆర్‌జెడి ఎమ్మెల్యే సత్యానంద్ భోక్త, సిపిఐ (ఎంఎల్) వినోద్ సింగ్, ఎమ్మెల్యే ప్రదీప్ యాదవ్ ఉన్నారు. మొత్తం 81 మంది ఎమ్మెల్యేలు ఉన్న జార్ఖండ్ అసెంబ్లీలో చంపాయ్‌కు 47 మంది సభ్యుల మద్దతు ఉంది. వీరిలో 16 మంది కాంగ్రెస్, ఒకరు ఆర్‌జెడి ఎమ్మెల్యే. రాష్ట్రంలో బిజెపికి 25 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గవర్నర్ నుంచి ఇంకా ఆహ్వానం రాకపోవడంతో తమ ఎమ్మెల్యేలను జార్ఖండ్ వెలుపలికి తరలించాలని జెఎంఎం, కాంగ్రెస్ భావిస్తున్నాయి. ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉందని తెలుస్తోంది.

బీహార్‌లో గంటల్లోనే చేయించారు కదా? జాప్యమెందుకు?

జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా ఛాంపై సోరేన్‌తో ప్రమాణస్వీకారం చేయించడంలో జరుగుతున్న జాప్యంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పొరుగున ఉన్న బీహార్‌లో నితీష్ కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయించడంలో ప్రదర్శించిన వేగం జార్ఖండ్‌లో ఎందుకు కన్పించడం లేదని ప్రశ్నించింది. కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీ గురువారం విలేకరులతో మాట్లాడుతూ 'హేమంత్ సోరేన్ ఎన్‌డిఎలో చేరి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. బిజెపి వాషింగ్ మిషన్లో ఆయన శుభ్రపడే వారు. ప్రపంచంలోనే అత్యంత పేరెన్నికగన్న విశ్వవిద్యాలయాన్ని మన దేశంలో బిజెపి స్థాపించింది. అక్కడ ఒకే ఒక అంశంపై పిహెచ్‌డిలు, పోస్ట్ డాక్టరేట్లు ఇస్తారు. అదేమంటే ఎన్నికైన ప్రభుత్వాలను ఎలా కూల్చేయాలి, ఎన్నికైన మిగతా 7లో

అలహాబాద్ హైకోర్టులోనే తేల్చుకోండి

- జ్ఞానవాపి మసీదు కమిటీకి సూచించిన సుప్రీం

న్యూఢిల్లీ : జ్ఞానవాపి మసీదు బేస్‌మెంట్‌లో హిందూ పూజారి పూజలు చేయవచ్చంటూ వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలపై అత్యవసరంగా విచారించాలని కోరుతూ జ్ఞానవాపి మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. దీనిపై అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాల్సిందిగా గురువారం కమిటీకి సూచించింది. సుప్రీం కోర్టు రిజిస్ట్రార్‌ను అంజుమన్ ఇంతెజమియా మసీద్ కమిటీ ఆశ్రయించగా, ఇక్కడ కాదని హైకోర్టుకు వెళ్లాలని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చెప్పినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. కోర్టు ఆదేశాల ముసుగులో స్థానిక పాలనా యంత్రాంగం మసీదు వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించిందని న్యాయవాదులు నిజామ్ పాషా, ఫాజిల్ అహ్మద్ ఆయుబిలు పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు వారం రోజులు సమయం ఇచ్చినా రాత్రికి రాత్రే హడావిడిగా మసీదు దక్షిణం వైపున గల గ్రిల్స్‌ను కూడా కట్ చేసే క్రమంలో వున్నారని తెలిపారు. మసీదు కమిటీ తమకు గల పరిష్కార మార్గాల కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా చూసేందుకే స్థానిక యంత్రాంగం కక్షిదారులతో కుమ్మక్కైందని పేర్కొన్నారు.



సుందరయ్య నగర్‌లో ఫండ్ క్యాంపెయిన్‌లో పాల్గొన్న శ్రీనివాసరావు తదితరులు

సిపిఎంకు అండదండలు ఇవ్వండి

- ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- తాడేపల్లి సుందరయ్య నగర్‌లో విరాళాల సేకరణ

లోపలి పేజీల్లో...



ప్రజాశక్తి
www.prajasakti.com



నిరాశ పరచిన మధ్యంతర బడ్జెట్

- అప్పులు - పన్నులే ఆదాయ వనరులు
- వేతన జీవులకు నిరాశే మిగిల్చారు
- కీలక రంగాలకు అరకొర నిధులు
- ఉద్యోగ కల్పన ఊసే లేదు
- నామమాత్రపు హామీలతో సరి



సభలో ప్రసంగిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి నిర్మలమ్మ

న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ నిరాశ కలిగించింది. రూ.47.65 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించగా అందులో అత్యధికంగా రక్షణ శాఖకు రూ.6.2 లక్షల కోట్లు కేటాయించారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఊరట లభించలేదు. గ్రామీణ ఉపాధి హామీ వంటి ముఖ్యమైన పథకాలకు కేటాయింపుల్ని నామమాత్రంగానే పెంచారు. మధ్యంతర బడ్జెట్‌లో ఎన్నికల తాయిలాలు కూడా ప్రకటించకపోవడంతో చప్పగా ఉంది. మరోవైపు దేశంపై అప్పుల భారం రోజురోజుకూ పెరిగిపోతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.168,72,554.17 కోట్ల మేర రుణాలు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఈ రుణ భారం వచ్చే ఆర్థిక సంవత్సరం చివరికి రూ.183,67,132.46 కోట్లకు చేరుతుందని నిర్మలా సీతారామన్ అంచనా. వీటిలో 2025 మార్చి 31 నాటికి అంతర్గత రుణాలే రూ.177,92,204 కోట్లు ఉంటాయని చెబుతున్నారు. ప్రత్యక్ష, పరోక్ష పన్ను రేట్లలోనూ, ఎగుమతి, దిగుమతి సుంకాల్లోనూ బడ్జెట్‌లో ఎలాంటి మార్పులూ చేయలేదు.

ఆర్థిక మంత్రి మధ్యంతర బడ్జెట్‌లో ప్రధానంగా నాలుగు వర్గాలపై దృష్టి సారించారు. తన దృష్టిలో ఈ నాలుగే అతి పెద్ద కులాలని ప్రధాని మోడీ గతంలో చేసిన ప్రకటనను దృష్టిలో పెట్టుకొని పేదలు, మహిళలు, యువత, రైతుల కోసం కొన్ని పథకాలు, కార్యక్రమాలు ప్రకటించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని పలు సర్వేలు చెబుతున్నప్పటికీ దానిపై ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ఒక్క మాట కూడా చెప్పలేదు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ఉపాధి కల్పన కోసం ఏదైనా పథకమో లేక కార్యక్రమమో ప్రకటిస్తారని ఎదురు చూసిన నిరుద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాబోయే ఐదు సంవత్సరాల్లో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తామని నిర్మల తెలిపారు. విద్యుత్ బిల్లుల నుండి సామాన్యులకు ఊరట కల్పించే ఉద్దేశంతో కొత్తగా సౌరశక్తి పథకాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా కోటి ఆవాసాలకు ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ లభిస్తుందని చెప్పారు. ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకునే వారికి ఏడాదికి రూ.15,000 నుండి రూ.18,000 ఆదా అవుతుందని తెలిపారు.

పట్టణ పేదల కోసం కూడా ఆర్థిక మంత్రి ఓ పథకాన్ని ప్రకటించారు. 'అద్దె ఇళ్లు, మురికివాడలు, అనధికారిక కాలనీలలో నివసించే మధ్యతరగతి ప్రజలు ఇళ్లను కొనుగోలు చేసేందుకు లేదా నిర్మించుకునేందుకు సాయం అందిస్తాం' అని చెప్పారు. ఈ పథకం లక్ష్యాన్ని మాత్రం వివరించలేదు. 9-14 సంవత్సరాల మధ్య వయసున్న బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా వ్యాక్సిన్ల తయారీని ప్రోత్సహిస్తామని అన్నారు. దేశంలో మరిన్ని వైద్య కళాశాలల ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేస్తామని, ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు కూడా వర్తింపజేస్తామని తెలిపారు.

ప్రధానమంత్రి స్వనిధి ద్వారా ఇప్పటి వరకూ 78 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించామని, రాబోయే కాలంలో మరో 2.3 లక్షల మందికి కొత్త రుణాలు ఇస్తామని ఆర్థిక మంత్రి చెప్పారు. పంటలకు నానో డిఎపి ఎరువులు అందజేస్తామని అన్నారు. చమురు గింజల రంగంలో ఆత్మ నిర్భరత సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. 2, 3 తరగతులకు చెందిన నగరాలకు కొత్తగా విమాన సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఛార్జింగ్ స్టేషన్లు, ప్రజా రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల్ని ప్రోత్సహిస్తామని వివరించారు.

స్వల్పంగా పెరిగిన కేటాయింపులు

మధ్యంతర బడ్జెట్‌లో పలు కీలక పథకాలకు కేటాయింపులు పెద్దగా పెంచలేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను కేవలం రూ.26,000 కోట్లు మాత్రమే పెంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.60,000 కోట్లు కేటాయించగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.86,000 కోట్లు (సవరించిన అంచనాలు) కేటాయించారు. ఇక ఆయుష్మాన్ భారత్ (పిఎంజెఎవై) పథకానికి కేటాయింపులు రూ.7,200 కోట్ల నుండి రూ.7,500 కోట్లకు అంటే కేవలం రూ.300 కోట్లు మాత్రమే పెరిగాయి.

కీలకమైన ఆరోగ్యం, విద్య రంగాలకు సైతం మధ్యంతర బడ్జెట్‌లో కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగాలకు జరిపిన కేటాయింపుల్ని సైతం పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యపై రూ.1,16,417 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా రూ.1,08,878 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. అదే విధంగా ఆరోగ్య రంగంపై రూ.88,956 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా రూ.79,221 కోట్లు వ్యయం చేశారు.

ద్రవ్యలోటును మరింత తగ్గిస్తాం

రాబోయే ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల మొత్తం మార్కెట్ విలువ (నామినల్ జిడిపి) 10.5% పెరగవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. తాజా బడ్జెట్ పత్రాల ప్రకారం ఈ విలువ రూ.3,22,71,808 కోట్లు ఉండవచ్చునని అంచనా. ద్రవ్య లోటును 5.8%కి తగ్గించామని నిర్మలా సీతారామన్ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి దీనిని 5.1%కి, 2025-26 నాటికి 4.5%కి తగ్గిస్తామని తెలిపారు. మూలధన వ్యయాన్ని రూ.10 లక్షల కోట్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ సవరించిన అంచనాలను బట్టి అది సాధ్యపడలేదని తేలింది. మూలధన వ్యయం రూ.9.5 లక్షల కోట్లకే పరిమితమైంది.

కేటాయింపుల్లోనూ కోతలే

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమం కోసం ఉద్దేశించిన కీలక పథకాలకు కూడా మధ్యంతర బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించారు. ఉదాహరణకు షెడ్యూల్డ్ కులాల వారి అభివృద్ధి కోసం ఒకే గొడుగు కింద సాయం చేసేందుకు ఉద్దేశించిన పథకానికి (అంబ్రెల్లా స్కీమ్) బడ్జెట్ అంచనాలు రూ.9,409 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.6,780 కోట్లు. షెడ్యూల్డ్ తెగలకు బడ్జెట్ అంచనాలు రూ.4,295 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.3,286 కోట్లు. మైనారిటీలకు బడ్జెట్ అంచనాలు రూ.610 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.555 కోట్లు. ఇతర బలహీన వర్గాలకు బడ్జెట్ అంచనాలు రూ.2,194 కోట్లు కాగా సవరించిన అంచనాలు రూ.1,918 కోట్లు.

ప్రతిపక్షాలపై విసుర్లు


గంట పాటు సాగిన నిర్మలమ్మ బడ్జెట్ ప్రసంగంలో... అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని ప్రస్తావించారు. అదేవిధంగా ప్రతిపక్షాల విమర్శలపైనా స్పందించారు. మోడీ ప్రభుత్వం లౌకికవాదాన్ని బలపరిచే చర్యలు చేపడుతోందని చెప్పుకున్నారు. ప్రతిపక్ష నేతలపైనే జరుగుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణలను గురించి మాట్లాడుతూ 'గతంలో సామాజిక న్యాయం ఓ రాజకీయ నినాదంగా ఉండేది. మా ప్రభుత్వానికి సంబంధించి అది సమర్థవంతమైన, అవసరమైన పరిపాలనా మోడల్. ప్రజలందరికీ సామాజిక న్యాయం అందేలా చూడాలి. అవినీతిని తగ్గించాలి. బంధుప్రీతిని రూపుమాపాలి' అని అన్నారు.

రైలు బోగీలకు వందే భారత్ హంగులు

బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.2.55 లక్షల కోట్లు కేటాయించారు. నలభై వేల సాధారణ బోగీల్లోనే వందే భారత్ రైళ్లలో ఉండే ప్రమాణాలు నెలకొల్పుతామని చెప్పారు. పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల కోసం మెట్రో, నమో భారత్ రైళ్లపై దృష్టి సారిస్తామని చెప్పారు. దేశంలో మూడు కొత్త రైల్వే ఆర్థిక కారిడార్లు ఏర్పాటు చేస్తామన్నారు. రైళ్ల రాకపోకలు ఎక్కువగా జరిగే మార్గాల్లో, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కారిడార్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని అన్నారు. ప్రధాని గతిశక్తి కార్యక్రమం కింద ఇంధనం- ఖనిజాలు - సిమెంట్ కారిడార్లు, ఓడరేవుల అనుసంధానం కారిడార్లు, రద్దీ అధికంగా ఉండే కారిడార్లు... ఇలా మూడు ఆర్థిక కారిడార్లను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. ప్యాసింజర్ రైళ్ల రాకపోకలను మెరుగుపరుస్తామని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని ఆమె చెప్పారు. కారిడార్ల ఏర్పాటుతో రైళ్ల ప్రయాణ వేగం కూడా పెరుగుతుందని ఆర్థిక మంత్రి అన్నారు.

పన్నులే ఆదాయం

ప్రభుత్వానికి ఇప్పుడు ఆదాయ పన్ను ద్వారానే అధిక ఆదాయం లభిస్తోంది. ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక వనరు అప్పులే అయినప్పటికీ అతి పెద్ద రెండో ఆర్థిక వనరు ఆదాయ పన్ను నుండి లభించే రాబడి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆర్థిక వనరుల్లో 19% రాబడి ఆదాయ పన్ను ద్వారా లభించేదేనని బడ్జెట్ పత్రాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆర్థిక వనరుల్లో 17% కార్పొరేట్ పన్నులు, 18% జీఎస్టీ, 28% అప్పుల ద్వారా సమకూరుతోంది.



పెరిగిన దేశం అప్పు

- 2019 నుంచి రూ.82 లక్షల కోట్లు పెరుగుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వంలో అప్పు విపరీతంగా పెరుగుతోంది. ఆరేళ్లలోనే దాదాపు రూ.82 లక్షల కోట్లు పెరిగింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అప్పులు వెల్లడయ్యాయి. 2024 మార్చి 31 నాటికి రూ.168,72,554.16 కోట్లు అప్పు ఉంటే, 2025 మార్చి 31 నాటికి అది కాస్తా రూ.183,67,132.46 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది. అంటే ఏడాదిలోనే రూ.14,94,577.85 కోట్ల అప్పు పెరుగుతుందని ప్రభుత్వ బడ్జెట్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2019-20లో రూ.101,98,173.64 కోట్ల అప్పు ఉంటే, అది కాస్తా 2024-25 నాటికి రూ.183,67,132.46 కోట్లకు పెరుగుతుంది. అంటే, రూ.81,68,958.81 కోట్లకు అప్పు పెరగనుంది.

(అప్పుల వివరాలు రూ.కోట్లలో)

2024 మార్చి 31 నాటికి..

దేశీయ అప్పు	: రూ.163,35,070.06
విదేశీ అప్పు	: రూ.5,37,484.10
మొత్తం అప్పు	: రూ.168,72,554.16

2025 మార్చి 31 నాటికి..

దేశీయ అప్పు	: రూ.177,92,204.95
విదేశీ అప్పు	: రూ.5,74,927.51
మొత్తం అప్పు	: రూ.183,67,132.46

2019 నుండి..

ఏడాది	అప్పు (రూ.కోట్లల్లో)
2019-20	రూ.101,98,173.64
2020-21	రూ.120,58,987.40
2021-22	రూ.135,45,605.78
2022-23	రూ. 152,23,605.78
2023-24	రూ.168,72,554.16
2024-25	రూ.183,67,132.46

పన్నుల్లో వాటా రూ.49 వేల కోట్లు

- గతేడాది కన్నా స్వల్పంగానే పెరుగుదల
- కేంద్ర బడ్జెట్‌లో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు రూ.49 వేల కోట్లు మాత్రమే రానున్నాయి. పన్నులు పెరుగుతున్నా, కేంద్రానికి ఆదాయం పెరుగుతున్నా కూడా ఆ పన్నుల్లో వాటా మాత్రం అతి స్వల్పంగా మాత్రమే పెరిగింది. తాజాగా కేంద్రం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో ఈ విషయాన్ని పొందుపరిచారు.

దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి కేంద్రం వసూలు చేసే పన్నుల్లో అన్ని రాష్ట్రాలకు వాటా నిధులను విడుదల చేస్తుంది. ఇందులో భాగంగానే రాష్ట్రానికి 4.047 శాతం వాటా నిధులు ఇచ్చేందుకు తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. మొత్తం ఎనిమిది రకాల పన్నులను కేంద్రం అన్ని రాష్ట్రాలకు అందిస్తుంది. ఈ క్రమంలోనే మొత్తం రూ.49,364.61 కోట్లను రాష్ట్రానికి కేటాయించింది. ఇది గతేడాదితో పోల్చితే కేవలం రూ.4,665 కోట్లు ఎక్కువగా ఉంది. కార్పొరేషన్ ట్యాక్స్, ఇన్‌కమ్ ట్యాక్స్, కేంద్ర జిఎస్‌టి విభాగాల్లో కొంతవరకు పెరుగుదల కనిపించగా, కస్టమ్స్ పన్నులు బాగా తగ్గుతున్నాయి.

కేంద్ర పన్నుల్లో వాటాగా వచ్చిన నిధులు (4.047 శాతంతో)

విభాగం	2023-24	2024-25
కార్పొరేషన్ ట్యాక్స్	13,731	15,502
ఇన్‌కమ్ ట్యాక్స్	15,125	17,082
ఆస్తి పన్ను	0.37	0.50
సిజిఎస్‌టి	13,369	15,092
కస్టమ్స్	1,528	1,007
ఎక్సైజ్ డ్యూటీ	574	602
ఇతరం	75	1.66
సర్వీస్ ట్యాక్స్	8	78
అడ్జస్ట్‌మెంట్	289	--
మొత్తం	**44,699**	**49,364**

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

విషాద బడ్జెట్ 2024

- మరోసారి వంచనకు గురైన రాష్ట్రం
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదనలూ లేవని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించే విషయం గానీ, పోలవరం నిర్వాసితుల విషయం గానీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన వంటి తదితర ఏ అంశాలూ ఈ బడ్జెట్లో లేకపోవడం మరొకసారి ఆంధ్రప్రదేశ్ ప్రజలను వంచించటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రం నుండి జిఎస్‌టి వసూళ్లు పెరిగినా రాష్ట్రం వాటా మాత్రం పెరగలేదని తెలిపారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలంతా ముందుకు రావాలని, వైసిపి, టిడిపి, జనసేన సహా అన్ని పార్టీలూ ఈ కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని కోరారు. కేంద్ర విద్రోహానికి వ్యతిరేకంగా ఈ నెల 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ గత పదేళ్ల విషాద భారతం కొనసాగింపుగానే ఉందని, 99 శాతం ప్రజలకు ఎలాంటి ఉపశమనమూ లేదని పేర్కొన్నారు. బడా కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం మిగిలిందని, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్లకు కట్టబెట్టడంలో ఈ ప్రభుత్వం జయప్రదమైందని విమర్శించారు. నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ధరల పెంపుదలతో ప్రజలపై భారాలు పెరిగాయని, జిఎస్‌టి పేరుతో రెట్టింపు పరోక్ష పన్ను వసూలు చేయడమే దీనికి తార్కాణమని విమర్శించారు. ప్రత్యక్ష పన్ను రాయితీలన్నీ కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చి పెంపుదల భారమంతా మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతిపై, ఉద్యోగవర్గాలపై వేయడం ఈ కాలంలో వారు సాధించిన 'ఘనత' అని వివరించారు. విదేశీ పెట్టుబడిదారులకు పెద్దపీట వేసి చిన్న పరిశ్రమలను చిన్న వ్యాపారస్తులను దెబ్బతీశారని, సాధారణ ప్యాసింజర్ రైళ్లను తగ్గించి వందేభారత్ రైళ్ల పేరుతో ప్రయాణాలను భారంగా మార్చారని విమర్శించారు. ఈ అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి, అణచడానికి మతాన్ని అడ్డంగా ఉపయోగించుకుని రామనామ స్మరణతో ప్రజలను మాయ చేయాలని, దానికోసమే రామనామస్మరణ ముసుగు వేసుకున్నారని తెలిపారు. దేశాన్ని మతరాజ్యంగా మార్చడం వారి ధ్యేయమని, రాష్ట్రపతి ప్రసంగంలో, బడ్జెట్ ఉపన్యాసంలో స్పష్టంగా వెల్లడైందని, ఒకవైపు ఆర్థిక భారాలు ప్రజలపై వేస్తూ కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతూ మరోవైపు మతోన్మాద భావోద్రేకాలను రెచ్చగొట్టి దేశాన్ని బలహీనపరిచే బిజెపి వైఖరిని మేధావులు, లౌకికవాదులు అన్ని పార్టీలూ ఖండించాలని కోరారు. ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకించాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

మేడిపండు చందంగా బడ్జెట్ : కాంగ్రెస్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మేడిపండు చందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ ఛైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. రైతులకు తీరని అన్యాయం జరిగిందని, పోలవరం, హోదా అంశాలు ప్రస్తావనకు రాలేదని వివరించారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తుందని భావించినా అదీ చేయలేదని తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధరను రూ.500కు తగ్గిస్తారనుకున్నామని, చేయలేదని పేర్కొన్నారు.

ఇది అభివృద్ధికర బడ్జెట్

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్య్రం సాధించి 2047 నాటికి వందేళ్లు పూర్తి చేసుకునే సమయానికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గురువారం నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఆయన ప్రశంసించారు. కేంద్ర బడ్జెట్‌లో మౌలిక రంగానికి, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామమన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టానికి పదేళ్ల కాలపరిమితి ముగుస్తున్నా రాష్ట్రానికి నిధులు సాధించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విఫలమయ్యారని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. ఐదేళ్లలో వైసిపి నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిందన్నారు.

ఉపాధి ఉసురు తీసిన బడ్జెట్

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి కేవలం రూ.86 వేల కోట్లు కేటాయించడం అంటే దాని ఉసురు తీయడమేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం విమర్శించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు గురువారం ప్రకటన విడుదల చేశారు. 12 కోట్ల కుటుంబాలకు 100 రోజులు ఉపాధి కల్పించాలంటే కనీసం మూడు లక్షల కోట్లు అవసరం ఉంటుందని, కేటాయింపులు దానిలో 25 శాతం కూడా లేవని పేర్కొన్నారు.

దొడ్డిదారిన వ్యవసాయ చట్టాల అమలుకు పన్నాగం !

- వ్యవసాయ కార్యకలాపాల్లో పిపిపి ప్రతిపాదనపై ఎస్‌కెఎం మండిపాటు
- 3న గ్రామస్థాయిలో బడ్జెట్ కాపీలు దగ్ధం చేయాలని పిలుపు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌లో తీసుకొచ్చిన అంశాలు వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీకి, మొత్తంగా ప్రజల సర్వతోముఖాభివృద్ధికి అత్యంత ప్రమాదకరమైనవని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విమర్శించింది. పంట చేతికి వచ్చిన తర్వాత సాగే కార్యకలాపాల్లో అంటే దిగుబడులను నిల్వ చేయడం, సరఫరా మార్గాలు, ప్రాథమిక, సెకండరీ స్థాయిల్లో ప్రాసెసింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్ వంటి వాటిల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచి పోషించేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారని, ఇది వ్యవసాయ రంగంలో కార్పొరేట్లకు పెద్ద పీట వేస్తూ, వారి చేతికి పగ్గాలు ఇవ్వడం తప్ప మరొకటి కాదని ఎస్‌కెఎం విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ప్రభుత్వ రంగాన్ని, సహకార సంఘాలను, ఎంఎస్‌ఎంఇలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడానికి బదులుగా ఈ కార్యకలాపాలన్నింటినీ కార్పొరేట్లకు గుత్తంగా కట్టబెట్టడమంటే మోడీ సర్కార్ గతంలో తీసుకొచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేయడమేనని ఎస్‌కెఎం మండిపడింది. ఈ ప్రతిపాదనను అమలు కానివ్వబోమని స్పష్టం చేసింది.

కనీస మద్దతు ధరను సి2 ప్లస్ 50శాతంగా ఇస్తామని 2021 డిసెంబరు 9న మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇచ్చిందని, కానీ ఇంతవరకు దాన్ని అమలు చేయలేదని, ఈ బడ్జెట్‌లో కూడా దాన్ని ప్రకటించకపోవడం రైతులను తీవ్రంగా మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరుద్యోగ సమస్య ఇంత తీవ్రంగా వున్నా ఉపాధి ఉత్పత్తికి ఎలాంటి గణనీయమైన కేటాయింపులు లేవని విమర్శించింది. ఈ నేపథ్యంలో, రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ, ఈ నెల 3వ తేదీన గ్రామ స్థాయిలో కార్పొరేట్ అనుకూల బడ్జెట్ కాపీలను దగ్ధం చేయాల్సిందిగా ఎస్‌కెఎం రైతులకు పిలుపునిచ్చింది. ఈ నెల 16న జరగబోయే గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

బడ్జెట్‌లో రైతాంగానికి ద్రోహం

- మాజీ ఎంపి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



దేశ వ్యవసాయ రంగాన్ని స్వదేశీ-విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి రైతులను కార్పొరేట్ సంస్థలకు కట్టుబానిసలుగా చేసే విధానాన్ని చేపట్టనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడం రైతాంగానికి ద్రోహం చేయడమేనని మాజీ ఎంపి వడ్డే శోభనాద్రీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో మూడు నల్ల వ్యవసాయ చట్టాల ద్వారా చేద్దామని అనుకున్న పనిని ఈ పేరుతో చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు పండించే పంటల సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధ కనీస మద్దతు ధర ఇస్తామని గానీ, నష్టపోయిన రైతులకు రుణమాఫీ చేస్తామని గానీ, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకుంటామని గానీ, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించబోమని చెప్పలేదని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం

- ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామారావు, సురేంద్ర

అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీలకు, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ బడ్జెట్‌ను ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. బడ్జెట్‌పై అరకువేలిలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర గురువారం మీడియాతో మాట్లాడారు. ఇది బిజెపి ఎన్నికల బడ్జెట్ అని, ప్రజా సంక్షేమ బడ్జెట్ కాదని విమర్శించారు. ఈ బడ్జెట్ ఆదివాసీలకు, పేదలకు, కార్మికులకు తీవ్ర నిరాశను మిగిల్చిందన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారానికి ఏటువంటి పరిష్కారం చూపకపోవడం దారుణమన్నారు. ఆదివాసీలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించి బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ప్రకటించిందని, గిరిజన యూనివర్సిటీ కేటాయింపు అతిగతిలేదన్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కుల రక్షణకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు.

విద్యారంగంపై అబద్ధాలతో కూడిన బడ్జెట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యారంగంపై అబద్ధాలతో కూడిన బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. వాస్తవాలకు దూరంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ అశోక్, కె ప్రసన్నకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత విద్యలో 38 శాతం విద్యార్థులను ఎన్‌రోల్‌మెంట్ పెరిగిందనడం, సైన్స్, టెక్నాలజీ ఇంజినీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43 శాతంగా ఉందని, ప్రపంచంలోనే ఇది అత్యుత్తమమైనదిగా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక విద్యార్థినులు చదువులకు దూరమయ్యారని పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, నవోదయాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని వివరించారు. స్కిల్ ఇండియా ద్వారా ఎన్ని లక్షల యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 390పైగా ప్రైవేట్ యూనివర్సిటీలకు ప్రభుత్వం అనుమతినిచ్చి యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏకలవ్య, సైనిక పాఠశాలలు ఎక్కడా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు విద్యారంగానికి లేనవి తెలిపారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని ప్రైవేట, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తోందని విమర్శించారు. దేశంలో విద్యా ప్రమాణాలు పెరగాలంటే బడ్జెట్ కేటాయింపులు పెరగాలని పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచాలి

- గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచాలని సిఐటియు అనుబంధ సంఘం అయిన గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌ను యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం పరంధామయ్య, బి నరసింహులు, కోశాధికారి ఖాదర్‌బాషా కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గత ఎనిమిదేళ్లుగా కేవలం రూ.5,700 వేతనంతోనే పనిచేస్తున్నారని తెలిపారు.

పెరుగుతున్న ధరలతో ఈ వేతనం సరిపోక పస్తులు వుండాల్సి వస్తుందన్నారు. తమకు కనీసం రూ.20 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, వాటి నుంచి రక్షణ కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సీనియర్ మేట్, జూనియర్ మేట్‌లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారికి బి రాజశేఖర్ హామీ ఇచ్చారు.



శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న లోకేష్ దంపతులు

ప్రజాశక్తి- శ్రీశైలం/శ్రీశైలం ప్రాజెక్టు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుటుంబ సమేతంగా శ్రీశైల మల్లన్నను దర్శించుకున్నారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైలానికి వచ్చిన టిడిపి నంద్యాల జిల్లా నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో లోకేష్ కొద్దిసేపు మాట్లాడారు. పార్టీని గెలిపించేందుకు తీసుకోవాల్సిన అంశాలను చర్చించారు.

సచివాలయాల్లోనే చౌక దుకాణాల రెన్యువల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చౌకదుకాణాల రెన్యువల్‌ను ఇక నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవచ్చని పౌరసరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో రెన్యువల్‌కు ఆర్‌డిఓ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకునేవారని, ఇబ్బందులతో కూడిన వ్యవహారం కావడంతో ఇక నుండి సచివాలయాల్లోనే ఆ పని చేసేలా మార్పులు చేసినట్లు తెలిపారు.

క్లాప్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డికి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు వేతనాలు పెంచాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు గురువారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడికి యూనియన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎ నాగరాజు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్, వాటర్ వెహికల్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇస్తున్నారని, క్లాప్ డ్రైవర్లకు మాత్రం ఇవ్వడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఒక్కోచోట ఒక్కో విధంగా ఇస్తున్నారని వివరించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. దీనికి స్పందించిన గంధం చంద్రుడు ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మహిళా ఉద్యోగులకు రెండేళ్ల చైల్డ్‌కేర్ సెలవులు ఇవ్వాలి

- ఎపి జెఎసి మహిళా విభాగం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా ఉద్యోగులకు రెండేళ్లపాటు చైల్డ్‌కేర్ సెలవులు ఇవ్వాలని ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగం కోరింది. గురువారం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగానికి నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా పి శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా ఎం వాణి, ఛైర్‌పర్సన్‌గా సిహెచ్ హరిత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అమరావతి జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తక్షణం మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. పి శ్రీదేవి మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు పని ప్రాంతాల్లో రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారు ఎక్కడ పనిచేసినా సమస్యలు ఒకేలా వుంటున్నా.. ప్రభుత్వాలు మారితే వేరుగా చూస్తున్నారని అన్నారు. మహిళా ఉద్యోగులందరికీ సమాన హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పలిశెట్టి దామోదరరావు, పొన్నూరు జయలక్ష్మి, బి కిశోర్ పాల్గొన్నారు.



కడప రిలే నిరాహార దీక్షల్లో మాట్లాడుతున్న గఫూర్

జగన్ సర్కార్ దివాలా తీసిందా?

- ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గఫూర్
- కొనసాగిన యుటిఎఫ్ దీక్షలు



నెల్లూరులో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందంటే ప్రభుత్వమేమైనా దివాలా తీసిందా? అని ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరహార దీక్షలు రెండో రోజు గురువారం కొనసాగాయి.

కడప కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ చేపట్టిన దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలతో ఉద్యోగులను నమ్మించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్లుగా ఉద్యోగులను అడుగడుగునా వంచిస్తూనే ఉన్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే కాంట్రిబ్యూటరీ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని మాట ఇచ్చి, ఇప్పుడు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించలేమంటూ తోకముడిచారన్నారు. ఉద్యోగుల జీతాలలో కోత విధించి చరిత్ర హీనుడిగా మిగిలిపోయారన్నారు. తమ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి భేషుగ్గా ఉందని ప్రకటిస్తూనే మరోపక్క ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్‌ఐ సొమ్ములను ప్రభుత్వ అవసరాలకు మళ్లించడం ఏంటని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడితే నిర్బంధాలు విధించడం, నోటీసులు జారీ చేయడం, అరెస్టులు చేయడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం రాబోయే ఎన్నికలలో భారీ మూల్యం చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్ ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన దీక్షల్లో ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు హజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలంటూ గడిచిన రెండు నెలల కాలం నుంచి పలు దపాలుగా పోరాటం చేసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కానరాలేదన్నారు. బకాయిలను చెల్లించకపోతే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పితీరుతామని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షల్లో కోవూరు, బుచ్చి ప్రాంతీయ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ పాల్గొని మద్దతు తెలిపారు. చిత్తూరు జిల్లా ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిర్వహించిన దీక్షలను గురువారం సాయంత్రం విరమించారు.

శ్రీ సత్యసాయి జిల్లా, ఒంగోలు, బాపట్ల, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, విజయనగరం జిల్లాల్లో దీక్షలు కొనసాగాయి.

ప్రజా పక్షపాతి బాలకృష్ణ

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



బాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంవిఎస్ శర్మ తదితరులు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేసిన ప్రజల పక్షపాతి సిపిఎం సీనియర్ నాయకులు ఎ బాలకృష్ణ అని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ కొనియాడారు. విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన డాక్టర్ బి గంగారావు అధ్యక్షతన ఎ బాలకృష్ణ సంతాప సభ గురువారం నిర్వహించారు. బాలకృష్ణ చిత్రపటానికి ఎంవిఎస్ శర్మ, జివిఎన్ చలపతి, ఎస్ సుధాకర్, ఎం జగ్గునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. విశాఖపట్నం విద్యార్థి ఉద్యమంలో బాలకృష్ణ చురుకైన పాత్ర పోషించారని, పార్టీ సిద్ధాంతం పట్ల ఆకర్షితులై పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా ఉన్నారని తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నంలో కార్మికుల సమస్యలపైనా, రైతు, వ్యవసాయ కార్మికులను సంఘటితం చేయడంలోనూ ప్రజలతో మమేకమై పనిచేసేవారని చెప్పారు. బాలకృష్ణ ఉద్యమకారునిగా, కార్మిక, కర్షక పక్షపాతిగా విశాఖ జిల్లాలో పేరు సంపాదించుకున్నారని గుర్తుచేశారు. ఆయన నమ్మిన సిద్ధాంతం బాటలో భార్య, పిల్లలూ ఉన్నారన్నారు. దోపిడీ లేని వ్యవస్థను స్థాపించాలనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువెళ్లడమే లక్ష్యంగా పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్, బి జగన్, బి పద్మ, బొట్టా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విఓఎల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

- సిఎస్‌ను కలిసిన ఎపి విఓఎల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విఓఎలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ 64ను రద్దు చేయాలని ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె ధనలక్ష్మి, కోశాధికారి ఎ తిరుపతయ్య, రాష్ట్ర కార్యదర్శి కె సోమన్న వినతిపత్రం అందజేశారు. విఓఎలు ఎదుర్కొంటున్న సమస్యలను సిఎస్‌కు వివరించారు. ప్రభుత్వం కాలపరిమితి విధించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వున్న 28 వేల మంది విఓఎల ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడిందని తెలిపారు. కాలపరిమితి సర్క్యులర్ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో విఓఎలు, పొదుపు మహిళలపై రాజకీయ జోక్యం పెరుగుతుందని వివరించారు. ఇప్పటికే చాలా మంది విఓఎలు రాజకీయ ఒత్తిళ్లకు తాళలేక మృతిచెందారని వివరించారు. సొసైటీల యాక్టు ప్రకారం వీరి నియామకాలు, తొలగింపులు గ్రామైక్య సంఘాల పరిధిలోనే వుంటాయని గుర్తుచేశారు. విఓఎలకు హెచ్‌ఆర్ పాలసీ అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు. పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌తో చర్చించి విఓఎల సమస్యలను పరిష్కరిస్తామని వారికి సిఎస్ హామీ ఇచ్చారు.

సలహాదారుల కోసం రూ.680 కోట్లు

- జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం సలహాదారుల కోసం రూ.680 కోట్లు ఖర్చు పెట్టిందని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గురువారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సజ్జల రామకృష్ణారెడ్డి కోసమే రూ.140 కోట్లు వెచ్చించారని అన్నారు. వారెన్ని సలహాలు ఇచ్చారు? వారిపై ఎంత ఖర్చు చేశారు? అనే వివరాలతో శాసనసభావేదికగా సమాధానం చెప్పాలని అన్నారు. 89 మంది సలహాదారులను నియమించడం, వారి అర్హతలను ఎవరికీ తెలియకుండా దాచిపెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సలహాదారుల నియామకంలో హైకోర్టును కూడా ప్రభుత్వం తప్పుదారి పట్టించిందని అన్నారు. ఐదేళ్ల పాలనలో విలేకరుల సమావేశం కూడా నిర్వహించని సిఎం ఎవరి సలహాలు తీసుకున్నారో తెలియడం లేదన్నారు. పాఠశాలల్లో వసతులు కల్పించకుండా ఐబి సిలబస్ పెట్టాలని ఏ సలహాదారుడు చెప్పారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. ప్రభుత్వ సొమ్ము తీసుకుంటున్న సజ్జల నిరంతరం ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారని అన్నారు. ఏ బడ్జెట్ కింద రూ.680 కోట్లు వెచ్చించారో సమాధానం చెప్పాలన్నారు. కేంద్రం పెట్టిన బడ్జెట్ దేశ భవిష్యతుకు దిక్సూచి అని పేర్కొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యం కాదు

- జనసేనతో మాత్రమే పొత్తులో ఉన్నాం
- భీమవరంలో ఎన్నికల శంఖారావం పూరించిన పురంధేశ్వరి

ప్రజాశక్తి - భీమవరం

14వ ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. ప్రత్యేక ప్యాకేజీకి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒప్పుకున్నారని, బిజెపి అగ్రనేత వెంకయ్యనాయుడుని తీసుకొచ్చి రాష్ట్రంలో సత్కారాలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా తెస్తామని షర్మిల చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో గురువారం ఆమె పర్యటించారు. భీమవరంలో నూతనంగా నిర్మించిన నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. నేతలు, కార్యకర్తల సమావేశం అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో జనసేనతో మాత్రమే బిజెపి పొత్తులో ఉందని, ఇక ఏ రాజకీయ పార్టీతోనూ తమకు పొత్తు లేదని స్పష్టం చేశారు.

టిటిడి అటవీ కార్మికుల ఘన విజయం

- 38 నెలల నిర్విరామ రిలే నిరాహారదీక్షకు ముగింపు
- టైంస్కేలు వర్తింపజేస్తూ ఎనిమిది వేలు వేతనం పెంపు
- టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడి



అటవీ కార్మికుల దీక్షలను విరమింపజేస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టైంస్కేలు వర్తింపజేస్తూ, జీతాలను పెంచుతున్నట్లు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రకటించారు. శ్రీ లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం నిరాహారదీక్షా శిబిరం వద్ద అటవీ కార్మికులకు నిమ్మరసం సుదీర్ఘ దీక్షను విరమింపజేశారు. 38 నెలల టిటిడి అటవీ కార్మికుల సుదీర్ఘ రిలేదీక్ష, ఆరు రోజులుగా నిరాహారదీక్ష, గురువారం టిటిడి పరిపాలనా భవనం వద్ద పౌరసమాజం ఆధ్వర్యంలో సంఘీభావ దీక్ష జరిగింది. సంఘీభావ నిరాహారదీక్షకు తిరుపతిలోని ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు వందలాదిమంది గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ టిటిడి పరిపాలనా భవనం వద్ద నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఇస్కాన్‌రోడ్డులోని దీక్ష శిబిరం వద్దకు టిటిడి ఛైర్మన్ చేరుకుని కార్మికులతో మాట్లాడారు. టిటిడి అటవీ కార్మికులకు ఎటువంటి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. ప్రస్తుతం కార్మికులకు ఎనిమిది వేల రూపాయలు జీతం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఒక్కో కార్మికునికి 25 మొక్కలు ఇస్తామని, ఆ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జీతం పెరుగుతుందని హామీ నిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ.. సీనియర్లను రెగ్యులర్ చేయాలని మూడేళ్ల పాటు (38 నెలలు) వేర్వేరు రూపాల్లో ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. సమస్య పరిష్కరించినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

నిరవధిక దీక్షకు పౌరసమాజం సంఘీభావం

టిటిడి పరిపాలనా భవనం వద్ద అటవీ కార్మికులకు సంఘీభావంగా పౌరసమాజం నిరాహారదీక్షల్లో పాల్గొంది. ప్రముఖ సీనియర్ జర్నలిస్టులు రాఘవశర్మ, ఉమామహేశ్వరరావు, ప్రముఖ రచయిత సాకం ప్రభాకర్, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు అంజయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొని ప్రసంగించారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు గోల్డెన్ జూబ్లీ వేడుకలు



గోదావరి ఎక్స్‌ప్రెస్


ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణం ప్రారంభించి 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఆంధ్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రొఫెసర్ వైఆర్.రెడ్డి ఆధ్వర్యాన విశాఖ రైల్వే స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. 1974 ఫిబ్రవరి ఒకటిన మొదటి సారిగా ప్రారంభించిన గోదావరి ఎక్స్‌ప్రెస్ వాల్తేర్ - సికింద్రాబాద్ మధ్య ట్రైన్ నంబర్ 7007గా, సికింద్రాబాద్ - వాల్తేర్ మధ్య ట్రైన్ నంబర్ 7008గా ప్రవేశపెట్టారు. ఈ ట్రైను 18 స్టేషన్లో ఆగుతుంది. ప్రయాణ దూరం 710 కిలోమీటర్లు (440 మైల్స్) సగటు ప్రయాణ సమయం 12 గంటల 25 నిమిషాలు. 17 భోగీలతో ప్రయాణించే ఈ గోదావరి రైలు గంటకు 57 కిలోమీటర్లు (35 మైల్ పర్ అవర్) తో ప్రయాణిస్తుంది. ఈ 50 ఏళ్లలో ఎందరో ప్రయాణికులకు ఎన్నో రకాల సేవలు అందించింది. ప్రస్తుతం గోదావరి ఎక్స్‌ప్రెస్ 12727, 12728 ట్రైన్ నంబర్లతో విశాఖపట్నం - సికింద్రాబాద్ మధ్య నడుస్తోంది.

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా

రామచంద్రరావు, జుత్తిగ నరసింహమూర్తి

- నూతన కమిటీ ఎన్నిక



వాక రామచంద్రరావు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వాక రామచంద్రరావు, జుత్తిగనరసింహమూర్తి ఎన్నికయ్యారు. సంఘం 15వ రాష్ట్ర మహాసభ పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జనవరి 30, 31 తేదీల్లో జరిగిన సంగతి తెలిసిందే. 31వ తేదీ సాయంత్రం నూతన కమిటీ ఎన్నికైందని ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి గురువారం తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కామన మునిస్వామి, ఎర్ర దేముడు, యామినేని స్టాలిన్, సిమా అప్పారావు, సహాయ కార్యదర్శులుగా బత్తిన నాగేశ్వరరావు, బొక్కా చంటి, మరో 16 మంది సభ్యులుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

మహా సభ తీర్మానాలివే

గీత వృత్తి రక్షణకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలి, గీత వృత్తిలో ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, వికలాంగులైన వారికి పరిహారం 30 రోజుల్లో చెల్లించాలి, చెట్లకు మార్కింగ్ విధానాన్ని అమలు చేయాలి, పెన్షన్ రూ.ఐదు వేలు ఇవ్వాలి. గీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తీర్మానించారు.

ధర్మవరంలో రోడ్డు వార్..!

- మరమ్మతులకు యత్నించిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల
- అడ్డుకున్న పోలీసులు.. అరెస్టు



గోనుగుంట్ల సూర్యనారాయణను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో గురువారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న గుంతలను పూడ్చే విషయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ధర్మవరం పట్టణంలో ఏర్పడిన గుంతలను జనవరి ఆఖరిలోపు అధికారులు పూడ్చకుంటే తానే సొంత నిధులతో వాటిని మరమ్మతు చేయిస్తానని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ గతంలో ప్రకటించారు. గడువు ముగియడంతో గురువారం ఉదయం రోడ్లను మరమ్మతులు చేసేందుకు వాహనాలు, వస్తువులతో ఆయన ధర్మవరం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా గుంతలు పూడ్చే కార్యక్రమానికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. ఇందుకు సూర్యనారాయణ ఒప్పుకోలేదు. సూర్యనారాయణతో పాటు ఆయన అనుచరులను అరెస్టు చేసి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై సాయంకాలం వారిని విడుదల చేశారు. ఈ ఘటనకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణతోపాటు మరో 29 మందిపై టూటౌన్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఒత్తిడితో పోలీసులు ఇలా బలవంతపు అరెస్టులు చేయడం దుర్మార్గం అని గోనుగుంట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

భీమవరంలో ఆరుకేజీల బంగారం స్వాధీనం

- పది మంది అరెస్ట్

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో అక్రమంగా తరలిస్తున్న ఆరు కేజీల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3.84 కోట్లుగా గుర్తించామని, అలాగే రూ.49,970 నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి రవిప్రకాష్‌మాట్లాడుతూ.. బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన చిలక సాయికిరణ్, చిలక అరవింద్, బక్క వీరసాయి, రాజమహేంద్రవరానికి చెందిన కోళ్ల వెంకట కాంతారావు, వంక వెంకటేష్, గున వీర వెంకటరమణ, దాసరి గణేష్, గొడ్డు పైడిరాజు, ఆవిడి హేమంత్, వినయ్‌లు గూడూరులో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో చెకింగ్ ఎక్కువగా ఉంటుందని భావించిన వీరు భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో దిగారు. రోడ్డు మార్గాన రాజమండ్రి బయలుదేరుతుండగా పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారని ఎస్‌పి తెలిపారు.

వైద్యశాఖలో అన్ని పోస్టులూ రెగ్యులరైజ్ చేయాలి

- యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెడికల్ అండ్ హెల్త్, విద్యాశాఖ, ఐటిఐ తదితర అన్ని శాఖల్లో ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం సమర్పించారు. 1207 జిఓ ద్వారా వైద్యారోగ్యశాఖలో జాయిన్ అయిన వారందరినీ రెగ్యులరైజ్ చేయడానికి వెంటనే వారి వివరాలను అప్‌లోడ్ చేయాలని కోరారు. వేతన పెంపు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్లియర్ చేయాలన్నారు. దీనికి స్పందించిన సిఎస్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి జగన్‌మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

రూ. ఏడు కోట్ల నగదు సీజ్

ప్రజాశక్తి-నెల్లూరు

నగదును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిస్తున్న 15 మంది నుంచి రూ. 7.23 కోట్ల నగదును గురువారం పోలీసులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. రాజమండ్రి, కాకినాడ ప్రాంతానికి చెందిన బంగారు వ్యాపారస్తులమని చెప్పుకుంటున్న 12 మంది నుంచి ఎటువంటి ఆధారాలు లేకుండా (బిల్లులు, కాగితాలు) తీసుకెళ్తున్న రూ.5.83 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరసారావుపేట ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వద్ద ఉన్న రూ.1 కోటి 40 లక్షల 50 వేలు నగదుకు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకుండా ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. నగదు మొత్తాన్ని ఆదాయపన్ను అధికారులకు అప్పగిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

సంపాదకీయం

ఉద్యోగ భర్తీపై ఉత్తుత్తి మాటలు

ఇంకొన్ని నెలల్లో ఎన్నికల ఢంకా మోగనున్న నేపథ్యంలో బుధవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఎంపిక ప్రక్రియను ప్రకటించింది. మొత్తం 6,100 పోస్టులను భర్తీ చేస్తామని, దశల వారీగా టెట్, ఆ తదుపరి డీఎస్సీ నిర్వహిస్తామని, ఒకట్రెండు రోజుల్లోనే నోటిఫికేషన్ వెలువరిస్తామని తెలిపింది. ఎన్నేళ్లుగానో ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ వార్త గొప్ప ఉత్సాహాన్ని కలిగించాలి. కానీ, అందుకు బదులు భారీ ఆశల మీద నీళ్లు కుమ్మరించిన నిరాశా భావన వారిని ఆవరించింది. అభ్యర్థుల ఆశలకు తగ్గట్టుగా కాక అధికార పార్టీ ఎన్నికల అవసరాలకు తగ్గట్టుగా, తూతూమంత్రంగా ఈ ప్రకటన ఉండటమే అందుకు కారణం.

తాము అధికారంలోకి రాకమునుపు, చంద్రబాబు ఏలుబడిలో రాష్ట్రం ఉన్నప్పుడు- ఉద్యోగ, నిరుద్యోగ బృందాల మీద జగన్ ఎంతో ప్రేమ ఒలకపోశారు. రాష్ట్రంలో 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, వాటిని భర్తీ చేయకుండా చంద్రబాబు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నలు గుప్పించారు. తాము అధికారంలోకి వచ్చీ రాగానే మెగా డీఎస్సీని ప్రకటించి, అటు పాఠశాల విద్యను, ఇటు ఉపాధ్యాయ అభ్యర్థుల జీవితాలను ఉద్ధరిస్తామని హామీలు గుప్పించారు.

కానీ, పీఠం ఎక్కాక ఆ విషయం పూర్తిగా మర్చిపోయారు. పాఠశాల విద్యలో పెను మార్పులు తెస్తున్నామంటూ హడావిడి చేయటం నిత్యకృత్యంగా పెట్టుకున్నారు. విలీనం పేరుతో వేలాది పాఠశాలలను మూసేసి, పోస్టులను కుదించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, పాఠశాలలకు హంగులూ అలంకరణ ... ఇత్యాది అంశాలపై ప్రచారార్భాటం చేశారు. బోధనకు అవసరమైన పోస్టుల భర్తీని మాత్రం సంపూర్ణంగా విస్మరించారు. దీంతో, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఐదారు లక్షల మంది ఉపాధ్యాయ అభ్యర్థులకు మరో ఐదేళ్ల వయసు మీరింది. ప్రభుత్వ ఉద్యోగం పొందగలమన్న ఆత్మవిశ్వాసం వారిలో రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఈ దశలో ప్రభుత్వం ఉన్న ఖాళీలను దాచిపెట్టి, కంటితుడుపు చర్యగా పోస్టుల భర్తీని ప్రకటించటం నిరుద్యోగులను మోసగించటమే! పైగా చంద్రబాబు హయాంలో మొదలు పెట్టిన అరకొర జీతపు రెండేళ్ల అప్రంటిస్ పద్ధతిని మళ్లీ తీసుకురావడం మరీ అన్యాయం. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల పోరాటంతో 2010లో రద్దు చేయబడ్డ ఆ విధానాన్ని మళ్లీ అమలు చేయబూనటం ఘోరం.

ఈ మొత్తం వ్యవహారం ఏదో ఒక విధంగా నిరుద్యోగులను మభ్యపెట్టటమే జగన్ ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. అదే సమయంలో 2025 జూన్ నుంచి అంతర్జాతీయ స్థాయి బోధన అందిస్తున్నామంటూ ఇంటర్నేషనల్ బాకలారియట్ (ఐబి) ప్రతినిధులతో ఒప్పందం చేసుకోవడం ప్రభుత్వ విద్యారంగంలోకి ప్రయివేటును చొప్పించటమే అవుతుంది. ఇప్పటికే బైజూస్‌తో ఒప్పందం ఉండనే ఉంది. ఒకవైపు ప్రభుత్వ ఉపాధ్యాయులను కుదించటం, మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి కార్పొరేట్లను చొప్పించటం ఆందోళన కలిగించే అంశం.

వివిధ వృత్తివిద్యల్లో శిక్షణ పొందిన వారు, ఉన్నత విద్యార్హతలు ఉన్నవారూ అందుకు తగిన ఉద్యోగాల్లో చేరి, స్థిరపడాలనుకోవడం సహజం. కానీ, అందరికీ, అన్నిటికీ సచివాలయ ఉద్యోగ కల్పనే గొప్ప ఘనతగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. గ్రామ సచివాలయాల్లో లక్షా 34 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటోంది. గతేడాది జరిగిన వైజాగ్ సమ్మిట్లో 13 లక్షల కోట్ల పెట్టుబడులతో, 6 లక్షల ఉద్యోగాలను కల్పించే 340 ఒప్పందాలు జరిగాయని సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రే అప్పట్లో గొప్పగా చెప్పారు. ఏడాది కాలం గడిచినా అందులో నాలుగో వంతు అయినా అమల్లోకి రాలేదు. ఒకపక్క పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నప్పుడు చేయాల్సింది చేయకుండా తాము చేసిందే గొప్పన్నట్టు టాం టాం వేసుకోవడం అర్థరహితం, మోసపూరితం.


మంత్రివర్గం ఆమోదించిన ఇతర అంశాల్లో విద్యుత్‌రంగంలో ప్రయివేటు పెట్టుబడులకు అవకాశం ఇవ్వడం ఒకటి. ఆ పేరుతో వేలాది ఎకరాల భూమినీ ఆయా సంస్థలకు అప్పనంగా కట్టబెట్టటమే దీని అసలు ఉద్దేశం. ఇలా మౌలిక రంగాలు అన్నిటిలోకీ ప్రయివేటు సంస్థల జోక్యాన్ని, పెత్తనాన్ని నెమ్మది నెమ్మదిగా పెంచటం... తరువాతి కాలంలో ప్రజలపై పెను భారాలకు దారి తీస్తుంది. ప్రపంచీకరణ విధానాలను నెత్తిన పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఈ తరహా ఒరవడితోనే సాగుతున్నాయి. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పిన మోడీ, ప్రతి ఏటా జనవరిలో జాబ్ కేలండరు అని ఊరించిన జగనూ మాట మీద నిలబడలేదు. ఇచ్చిన హామీలకు కట్టుబడని పాలకులకు యువతే తగిన గుణపాఠం చెబుతుంది!

మహనీయుల మాట



మతమన్నది మనిషి
రూపొందించుకున్నదే తప్ప,
మతం వల్ల మనిషి రూపొందలేదు.

భగత్‌సింగ్



పోరుబాటలో ఐరోపా రైతాంగం, అనేక దేశాల్లో రోడ్ల దిగ్బంధనం !

అంతర్జాతీయం

సత్య

ఐరోపా యూనియన్ పార్లమెంటు ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. పార్టీలన్నీ సిద్ధం అవుతుండగా వివిధ దేశాల్లో రైతులు పోరుబాట పడుతున్నారు. నిన్న జర్మనీ, రుమేనియాలో, నేడు ఫ్రాన్సు, ఇతర దేశాల్లో రైతులు రోడ్డెక్కారు. అనేక దేశాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. అక్కడ రైతులు మన మాదిరిగా జెండాలు పట్టుకొని ప్రదర్శనలు చేయటానికి బదులు ట్రాక్టర్లు, ట్రక్కుల వంటి వాటితో వచ్చి ఎక్కడికక్కడ రోడ్ల మీద నిలిపివేసి నిరసన తెలుపుతున్నారు. అనేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. టిక్‌టాక్ వంటి వాటిలో నిరసన వీడియోలు నింపుతూ ప్రచారంలో పెడుతున్నారు. ఐరోపా సామాజిక మాధ్యమాల్లో ఆకర్షిస్తున్న పదాల జాబితాలో "రైతులు" కూడా చేరిందంటే సమస్యల తీవ్రతకు అద్దం పడుతున్నది.



బ్రసెల్స్‌లో జరుగుతున్న ఐరోపా యూనియన్ సమావేశాల సందర్భంగా తమ నిరసన వెల్లడిస్తూ బెల్జియం, ఫ్రాన్స్, ఇటలీ తదితర దేశాల్లో రైతులు (జనవరి 31) బుధవారం నాడు ఆందోళనకు దిగారు. నౌకాశ్రయాలు, ఇతర ఆర్థిక కేంద్రాలలో లావాదేవీలను జరగకుండా చేశారు. అనేక చోట్ల ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ వాహనాలతో రోడ్లను దిగ్బంధనం చేశారు. బ్రసెల్స్ నగరంలో ప్రవేశించేందుకు రైతులు పెద్ద ఎత్తున నలుమూలల నుంచీ తరలి వస్తున్నట్లు వార్తలు వచ్చాయి. గురువారం నాడు నిరసన తెలపనున్నట్లు ప్రకటించారు. అనేక చోట్ల పౌర జీవనానికి కూడా ఆటంకం కలిగింది. రైతుల సమస్యలను వినాల్సి ఉందని బెల్జియం ప్రధాని అలెగ్జాండర్ డెకరో అన్నాడు. వాతావరణ మార్పుల నుంచి పర్యావరణ కాలుష్యం వరకు అనేక పెద్ద సమస్యలను వారు ఎదుర్కొంటున్నారని చెప్పాడు. తీవ్ర వ్యతిరేకత వెల్లడవుతున్న కారణంగా దక్షిణ అమెరికా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తాత్కాలికంగా పక్కన పెడుతున్నట్లు ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్ ప్రకటించాడు. ఐరోపా యూనియన్ పార్లమెంటు ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. పార్టీలన్నీ సిద్ధం అవుతుండగా వివిధ దేశాల్లో రైతులు పోరుబాట పడుతున్నారు. నిన్న జర్మనీ, రుమేనియాలో, నేడు ఫ్రాన్సు, ఇతర దేశాల్లో రైతులు రోడ్డెక్కారు. అనేక దేశాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. అక్కడ రైతులు మన మాదిరిగా జెండాలు పట్టుకొని ప్రదర్శనలు చేయటానికి బదులు ట్రాక్టర్లు, ట్రక్కుల వంటి వాటితో వచ్చి ఎక్కడికక్కడ రోడ్ల మీద నిలిపివేసి నిరసన తెలుపుతున్నారు. అనేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. టిక్‌టాక్ వంటి వాటిలో నిరసన వీడియోలు నింపుతూ ప్రచారంలో పెడుతున్నారు. ఐరోపా సామాజిక మాధ్యమాల్లో ఆకర్షిస్తున్న పదాల జాబితాలో "రైతులు" కూడా చేరిందంటే సమస్యల తీవ్రతకు అద్దం పడుతున్నది.

ఐరోపా యూనియన్ దేశాల్లో రుమేనియాలో అత్యధికంగా 35 లక్షల మంది రైతులు ఉన్నారు. జనవరి పది నుంచి వీరితో పాటు రవాణా రంగ కార్మికులు అనేక సందర్భాలలో కలిసే ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి సమర్పించిన 47 డిమాండ్ల జాబితాలో డీజిల్ పన్ను తగ్గింపు, మోటారు వాహనాలపై పౌర సంబంధ బీమా ప్రీమియం తగ్గింపు వంటి అంశాలతో పాటు ఉక్రెయిన్ సంక్షోభం ముందుకు తెచ్చిన ప్రధాన అంశాలు ఉన్నాయి. ఐరోపా దేశాల్లో రవాణాకు పర్మిట్లు అవసరం, ఉక్రెయిన్ సంక్షోభం తరువాత వాటిని ఎత్తివేశారు. దాంతో రవాణా ఖర్చులు తక్కువగా ఉండే ఉక్రెయిన్ వాహనాల నుంచి వచ్చిన పోటీని రుమేనియా, ఇతర దేశాల ట్రక్కుల యజమానులు తట్టుకోలేకపోతున్నారు. అంతేకాదు, అక్కడి నుంచి చౌకగా దిగుమతి చేసుకుంటున్న ధాన్యం వంటి వ్యవసాయ ఉత్పత్తుల కారణంగా మిగతా దేశాల్లో ధరలు పడిపోయి రైతాంగానికి గిట్టుబాటు కావటం లేదు. రుమేనియా రాజధాని బుఖారెస్ట్‌లో నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని జనవరి పదిన అడ్డుకున్నారు. దాంతో ఇరవై కిలోమీటర్ల పొడవున రైతులు బైఠాయించారు. పది రోజుల తరువాత 21వ తేదీన అనుమతి ఇచ్చారు. అంతకు ముందు ఉక్రెయిన్‌తో రెండు చోట్ల సరిహద్దులను రైతులు దిగ్బంధించారు. మన దేశంలో నిరసన తెలిపిన వారిని రైతులు కాదని ఎలా నిందించారో రుమేనియాలో కూడా అదే జరిగింది. సాధారణ రైతులతో పాటు వ్యవసాయ రంగంతో సంబంధం ఉన్న చిన్న, మధ్య తరగతి వ్యాపారులు కూడా బాసటగా నిలిచారు.

నాలుగు శాతం భూమిని సాగు చేయకుండా వదలి వేయాలని, పంటల మార్పిడి పద్ధతిని విధిగా పాటించాలని, రసాయన ఎరువుల వాడకాన్ని ఇరవై శాతం తగ్గించాలనే నిబంధనలను ఐరోపా యూనియన్ అమలు చేయనుంది. దీని వలన ప్రపంచంలో ఇతర రైతులతో చౌకగా వచ్చే దిగుమతులతో తాము పోటీ పడలేమని స్థానిక రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ద్రవ్యోల్బణం కారణంగా తమకు నేరుగా ఇచ్చే నగదు విలువ కూడా తగ్గుతున్నదని ఆందోళన వెల్లడిస్తున్నారు. ఉక్రెయిన్ సంక్షోభం ఐరోపా అంతటా రైతాంగాన్ని ప్రభావితం చేయటంతో వారు వీధుల్లోకి వస్తున్నారు. ఉక్రెయిన్‌లో సగటు కమతా విస్తీర్ణం వెయ్యి హెక్టార్లు కాగా, ఐరోపా ఇతర దేశాల సగటు కేవలం 41 హెక్టార్లు మాత్రమే. అందువలన గిట్టుబాటులో కూడా తేడా ఉంటున్నది. ఉక్రెయిన్ దిగుమతులను నిరసిస్తూ పోలాండ్ రైతులు జనవరి 24న దేశవ్యాపితంగా ఆందోళన చేశారు. ఉక్రెయిన్ ధాన్యాన్ని ఆఫ్రికా, ఆసియా మార్కెట్లకు పంపాలి తప్ప ఐరోపా దేశాలకు కాదని పోలాండ్ రైతు సంఘ ప్రతినిధి చెప్పాడు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఇప్పటి వరకు స్పెయిన్, ఇటలీ, పోర్చుగీసు రైతులు ప్రభావితం కాలేదని, అయితే పర్యావరణ రక్షణ చర్యలు వారిని కూడా వీధుల్లోకి తీసుకురానున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. స్పెయిన్, పోర్చుగీసులో కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి కారణంగా వ్యవసాయానికి వాడే నీటి పరిమాణం మీద ప్రభుత్వాలు ఆంక్షలు విధించాయి. జరిగిన నష్టాలకు తమకు పరిహారం ఇవ్వటం లేదని రైతులు విమర్శించారు. ఒక్కో చోట ఒక్కో సమస్య ముందుకు వస్తుండటంతో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ ఐరోపా దేశాల్లో రైతులు రోడ్లెక్కటం ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగమంటూ నత్రజని వాయువు విడుదలను పరిమితం చేసేందుకు పూనుకోవటంతో 2019లో నెదర్లాండ్ అంతటా రైతులు రోడ్లను దిగ్బంధించారు. గతేడాది డిసెంబరులో కూడా నిరసన తెలిపారు. ఉక్రెయిన్ డ్రైవర్లకు పర్మిట్ పద్ధతి అమలు జరపాలని కోరుతూ పోలాండ్ ట్రక్కరు సరిహద్దులను మూసివేసి అడ్డుకున్నారు. ఉక్రెయిన్ నుంచి వస్తున్న చౌక దిగుమతులను అడ్డుకోవాలని రైతులు జనవరి ప్రారంభంలో వీధుల్లో ప్రదర్శనలు చేశారు. వ్యవసాయ సబ్సిడీల కోత ప్రతిపాదనలకు నిరసనగా వేలాది మంది జర్మన్ రైతులు బెర్లిన్‌ను దిగ్బంధం చేశారు. తాజాగా ఫ్రాన్సులో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు, కొన్ని చోట్ల హింసారూపం తీసుకుంది.


వివిధ దేశాల నుంచి చౌకగా దిగుమతులు చేసుకుంటూ తమ పొట్టగొడుతున్నారని ఆగ్రహించిన ఫ్రెంచి రైతులు తమ దేశం గుండా స్పెయిన్ నుంచి మొరాకో వెళుతున్న వైన్, కూరగాయల రవాణా ట్రక్కులను అడ్డుకొని ధ్వంసం చేశారు. తమను ఫణంగా పెట్టి మాక్రాన్ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు పూనుకుందని, ఫలితంగా ఆహార ఉత్పత్తిదారులు ధరలను తగ్గించాల్సి వచ్చిందని, హరిత విధానాల పేరుతో తీసుకుంటున్న చర్యలు కూడా తమను దెబ్బ తీస్తున్నాయని రైతులు నిరసన తెలుపుతున్నారు. జీవ వైవిధ్యం పేరుతో ఐరోపా యూనియన్ నుంచి సహాయం పొందాలంటే నాలుగు శాతం భూమిని ఖాళీగా ఉంచాలని, రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలనే షరతులు పెడుతున్నట్లు చెబుతున్నారు. ఇటలీ నుంచి వస్తున్న కమలాలు కిలో 6.3 డాలర్లకు లభిస్తుండగా పురుగుమందులు తక్కువ వాడుతున్న కారణంగా ఉత్పత్తి ఖర్చులు పెరిగిన తమ సరకు 8.57 డాలర్లకు విక్రయించాల్సి వస్తున్నందున పోటీ ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. అటు వినియోగదారులు, ఇటు రైతులు ఇద్దరూ నష్టపోతున్నారు. ఇటీవల జరిగిన ఒక సర్వేలో 82 శాతం మంది పౌరులు రైతాంగానికి మద్దతు తెలిపారు. ఫ్రాన్సులో మూడో వంతు మంది రైతులు దారిద్ర్య రేఖకు దిగువున ఉండగా సగటున రోజుకు ఇద్దరు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పర్యావరణవేత్త యానిక్ జడోట్ చెప్పాడు. మట్టి పిసుక్కొనే వారని మన దేశంలో చిన్న చూపు చూస్తున్నట్లే ఫ్రాన్స్‌లో కూడా రైతులంటే చిన్న చూపు ఉంది. రైతుల ఆందోళన కారణంగా వ్యవసాయ ఇంధనంపై పన్నులు పెంచాలనే ప్రతిపాదనను వెనక్కు తీసుకుంటున్నట్లు ఫ్రెంచి నూతన ప్రధాని గాబ్రియెల్ అటాల్ జనవరి 26న ప్రకటించినప్పటికీ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఉక్రెయిన్ నుంచి చౌకధరలకు వస్తున్న ధాన్యం, పంచదార, కోడి మాంసం, గుడ్లు కారణంగా తమ దేశాల్లో సమస్యలు తలెత్తిన కారణంగా వాటి మీద ఆంక్షలు విధిస్తామని తూర్పు ఐరోపా దేశాలను గతంలో ఫ్రాన్సు తప్పుపట్టింది. ఇప్పుడు అదే పాలకులు రైతుల ఆందోళన కారణంగా తమ వైఖరిని మార్చుకొని దిగుమతులను అడ్డుకోవాలని చెబుతున్నారు. బెల్జియంలో కూడా రైతులు నిరసన తెలిపారు. రాజధాని బ్రసెల్స్‌లో స్పెయిన్ నుంచి వస్తున్న ఐదు లారీల కూరగాయలను ధ్వంసం చేశారు. పారిస్‌కు దారితీసే రోడ్లను దిగ్బంధం చేయటం అంటే గీత దాటటమేనని, గ్రామీణ జీవనాన్ని నాశనం చేస్తున్నారని ప్రభుత్వం జనవరి 29న హెచ్చరించింది. రైతులు రాజధానిని దిగ్బంధం చేయనున్నారనే వార్తలతో అధ్యక్షుడు మాక్రాన్ పారిస్ ముట్టడి అనే అంశం గురించి మంత్రులతో అత్యవసర సమావేశం జరిపాడు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు మొత్తం ప్రభుత్వం, అధ్యక్షుడు కూడా సిద్ధపడినట్లు ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు. నగరంలోకి ట్రాక్టర్లను అడ్డుకొనేందుకు పదిహేను వేల మంది పోలీసు, ఇతర సిబ్బందిని సిద్ధం చేశారు. విమానాశ్రయాలు, ప్రధాన ఆహార మార్కెట్లకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. రైతుల దిగ్బంధన ఆందోళన కారణంగా తాము దక్షిణ ఫ్రాన్సులో ప్రవేశించలేక పోతున్నామని బ్రిటన్ పౌరులు కొందరు చెప్పారు. తమ ఆందోళన పౌరులకు ఇబ్బంది కలిగించటానికి కాదని, సమస్య తీవ్రతను ప్రభుత్వానికి తెలియచేయటానికేనని రైతులు చెప్పారు.

అనేక దేశాల్లో ప్రభుత్వాలు విఫలమైన కారణంగా మితవాద శక్తులు పేట్రేగిపోతున్నాయి. జూన్‌లో జరగనున్న ఐరోపా యూనియన్ పార్లమెంటు ఎన్నికల్లో తమ సత్తా చాటాలని చూస్తున్నాయి. ఐరోపా యూనియన్ కారణంగానే అన్ని తరగతుల వారూ సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రచారం చేస్తున్నారు. ఇటీవలి ఒక సర్వే ప్రకారం ఆస్ట్రియా, బెల్జియం, చెక్, ఫ్రాన్స్, హంగరీ, ఇటలీ, నెదర్లాండ్స్, పోలాండ్, స్లోవేకియాలలో మితవాద శక్తులది పైచేయి కావచ్చుని, మరో తొమ్మిది దేశాలలో రెండవ, మూడవ స్థానాలలో ఉండవచ్చునని తేలింది. ఈ శక్తులు సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున ప్రవేశించాయి. రుమేనియాలో 2019లో కేవలం 1.75 వేలుగా ఉన్న టిక్‌టాక్ వినియోగదారులు 2023నాటికి 78.5 లక్షలకు పెరిగారు. ఫ్రాన్సులో 2.14 కోట్లు, జర్మనీలో 2.09 కోట్లు, ఇటలీలో 1.97 కోట్ల మంది టిక్‌టాక్ వినియోగదారులు ఉన్నారు. రుమేనియాలో చౌక ధరలకు లభిస్తున్న ఇంటర్నెట్ కారణంగా రైతుల ఉద్యమానికి ఎంతో ప్రచారం లభించిందని, మితవాద శక్తులు ప్రభుత్వాల పట్ల వ్యతిరేకతను పెంచుతున్నాయని కొంత మంది ఆరోపించారు. అసలు సమస్యలు ప్రస్తావించకుండా ఎవరెన్ని ప్రచారాలు చేసినా జనం స్పందించరన్న సంగతి వేరే చెప్పనవసరం లేదు. ★

అబద్ధాల పునాదిపై అయోధ్య రామాలయం

కామన్ సెన్స్



రామ భక్తుడు, 'రామ్ చరిత్ మానస్' రాసిన కవి పుంగవుడు తులసీదాస్, రామ మందిరాన్ని తురుష్క రాజులు కూలగొడితే ఊరుకుంటాడా? వళ్ళు మండి తన ఆక్రోశాన్ని భక్తి పూర్వకంగా ఆ రాముడికి నివేదించుకోవాలి కదా? నివేదించుకోలేదు - ఆయనేమైనా వేరే విషయాలు రాశాడా? లేదే - కేవలం రామచరిత్ మానసే రాశాడు. అలాంటప్పుడు తన కాలంలో జరిగిన రామాలయ విధ్వంసం గురించి రాయకుండా ఉంటాడా? ఉండడు కదా? వీటన్నిటి సారాంశం ఏమిటంటే అయోధ్యలో బాబర్ అనే ముస్లిం రాజు హిందూ దేవాలయాన్ని కూలగొట్టించ లేదు. అదే స్థలంలో తన పేరుతో మసీదు కట్టించలేదు-ఇది స్పష్టం!



డా॥ దేవరాజు మహారాజు

అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చేయడం గురించి, అది రాముడి జన్మస్థలం అని ఆర్.ఎస్.ఎస్-బిజెపి లు ప్రకటించడం గురించి దేశంలో చాలా కాలంగా చర్చ జరుగుతూ ఉంది. ఈ వివాదం గత పాతికేళ్ళ నుండే కాదు, కొన్ని శతాబ్దాలుగా సాగుతూ ఉంది. సుప్రీం కోర్టు తీర్పు కూడా అది రాముడి జన్మస్థలమని నిర్ధారించలేదు. పైగా బాబ్రీ మసీదును కరసేవకులు కూల్చడాన్ని నేరంగా పరిగణించింది. కూలగొట్టిన చోటే రామాలయం కట్టుకోవడానికి అనుమతించలేదు. అందుకే, ఆలయ నిర్మాణం ఆ స్థలానికి దూరంగా చేస్తున్నారు. అంతమాత్రానికి మసీదు ఎందుకు కూల్చాల్సి వచ్చిందో, దాని వెనక రాజకీయమేమిటో ఈ దేశ ప్రజలు అర్థం చేసుకుం టున్నారు. మరో వైపు అయోధ్యలో రామమందిరం కోసం వేల ఇళ్లు ధ్వంసం చేసిన సంగతి, పురాతన కట్టడాలు కూల్చేసిన సంగతి మీడియా కప్పిపుచ్చింది. ఇళ్లు కూల్చిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకుండా అందరినీ నిరాశ్రయుల్ని చేసిన సంగతి మోడీ మీడియా మరుగు పరిచింది. సమస్యను పరిష్కరించే దిశలో కాకుండా సమస్యలు పెంచే దిశలో బిజెపి ప్రభుత్వం ముందుకెళ్ళింది.

ఇవన్నీ ఇలా ఉంటే చరిత్ర ఏం చెబుతోంది? బాబర్ అయోధ్యలో మసీదు కట్టించాడా? దేవాలయాన్ని కూల్చి కట్టించాడా? బాబ్రీ మసీదు 1992 డిసెంబర్ ఆరున కూల్చేసిన తర్వాత ఆ మసీదు అడుగున ఆర్కియాలజీ విభాగానికి ఏ ఆధారాలు దొరికాయి? లాంటి విషయాల మీద చరిత్రకారులు, పరిశోధకులు ఏం చెప్పారో తెలుసుకోవడానికి తప్పనిసరై నేను కూడా చరిత్ర పొరల్లోకి వెళ్ళాల్సి వచ్చింది. మొఘల్ చక్రవర్తి బాబర్ (1483-1530 సి.ఇ)కు తన దినచర్య (డైరీ) రాసుకునే అలవాటు ఉండేది. దాన్ని ఆయన చాగ్తాయే-తుర్కీ అనే తన మాతృభాషలో రాసుకున్నాడు. అది 'తుజక్ ఐ బాబ్రీ' గా వెలువడింది. దాన్ని బాబర్ మనుమడు అక్బర్ ద గ్రేట్ (1542-1605 సి.ఇ) తన ఆస్థాన పండితుడితో పారసీ భాషలోకి అనువదింపజేశాడు. అప్పుడు అది 'బాబర్ నామా'గా వెలుగు చూసింది. వీటిలో బాబ్రీ మసీదు ప్రసక్తి లేదు. చాలా కాలం తర్వాత బ్రిటీష్ పరిపాలనా కాలంలో బివిరిడ్జి అనే రచయిత్రి భారతదేశం సందర్శించినపుడు తుజక్ ఐ బాబ్రీ-బాబర్ నామా రెండింటినీ చదివి, వాటి ఆధారంగా 'మెమొయిర్ ఆఫ్ బాబర్' పేరుతో 1921లో ఇంగ్లీషు అనువాదం తెచ్చారు - ఇందులో కూడా బాబర్ మసీదు కట్టించిన విషయం లేదు. మూల గ్రంథాల్లోనే లేనప్పుడు అనువాదంలో ఎందుకుంటుందీ? ఇబన్ బటూటా అనే అరబ్ యాత్రికుడు ఆ కాలంలో తన అనుభవాలనన్నింటినీ రిహ్లా అనే గ్రంథంలో నిక్షిప్తం చేశాడు. అందులో కూడా బాబర్ మసీదు కట్టించిన విషయం లేదు.

ఆ నాటి గ్రంథాలలో ఎక్కడా బాబర్ హిందూ దేవాలయం కూలగొట్టించాడని గానీ, అదే స్థలంలో మసీదు కట్టించాడని గానీ లేదు. అసలు ఆయన జీవిత కాలంలో అయోధ్యకు వెళ్ళనే లేదు. తన మంత్రులను గానీ సైన్యాధికారులను గానీ పంపి అక్కడ దేవాలయమేదీ కూలగొట్టించలేదు. మసీదు కూడా కట్టించలేదు. అయితే సిర్వా-ఘాఘరా నదుల సంగమానికి బాబర్ మార్చి 1528 (సి.ఇ) 28న ఒకసారి వెళ్ళాడు. అది అవధ్ ప్రాంతం. అక్కడికి అయోధ్య 72 మైళ్ళ దూరంలో ఉంది, వీరి విషయాలు అలా ఉంచి - రామ భక్తుడు, 'రామ్ చరిత్ మానస్' రాసిన కవి పుంగవుడు తులసీదాస్, రామ మందిరాన్ని తురుష్క రాజులు కూలగొడితే ఊరుకుంటాడా? వళ్ళు మండి తన ఆక్రోశాన్ని భక్తి పూర్వకంగా ఆ రాముడికి నివేదించుకోవాలి కదా? నివేదించుకోలేదు - ఆయనేమైనా వేరే విషయాలు రాశాడా? లేదే - కేవలం రామచరిత్ మానసే రాశాడు. అలాంటప్పుడు తన కాలంలో జరిగిన రామాలయ విధ్వంసం గురించి రాయకుండా ఉంటాడా? ఉండడు కదా? వీటన్నిటి సారాంశం ఏమిటంటే అయోధ్యలో బాబర్ అనే ముస్లిం రాజు హిందూ దేవాలయాన్ని కూలగొట్టించ లేదు. అదే స్థలంలో తన పేరుతో మసీదు కట్టించలేదు-ఇది స్పష్టం!

సరే మరి, ఎవరూ కట్టించకపోతే అయోధ్యలో మసీదు ఎలా వచ్చిందీ? అనే అనుమానం సహజంగా వస్తుంది. మరింత విస్తృత పరిశోధనల తర్వాత మరి కొన్ని విషయాలు బయటికొచ్చాయి. చరిత్రకారుడు సశీల్ కుమార్ 'ద డిస్ప్యూటెడ్ మాస్క్' అనే పేరుతో తన పరిశోధనలు గ్రంథస్థం చేశాడు. రొమిల్లా థాపర్, కునాల్ చక్రవర్తి, సుదిర జైస్వాల్ వంటి ప్రసిద్ధ చరిత్రకారులు కూడా ఈ విషయాలు చర్చించారు. అయోధ్య బాబ్రీ మసీదును మొదట 'జామా మసీదు' అనే పిలిచేవారు. చాలాకాలం దానికి అ పేరే వాడుకలో ఉంది. 1855 తర్వాతే దాన్ని బాబ్రీ మసీదు అనడం ప్రారంభించారు. పురాతన నిర్మాణాలు బాగా అధ్యయనం చేసిన నిపుణులు నిర్ధారించిందేమంటే -14-15 శతాబ్దాల మధ్య కాలంలో దాన్ని జోన్‌పూర్ షర్కీ రాజులు కట్టించారని! వారు కట్టించిన ఇతర మసీదుల గోపురాలు, లోపలి దూలాలు, స్థంభాలు, గోడల నిర్మాణం ప్రవేశ ద్వారం (ఆర్చ్) వగైరా క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వారు ఆ నిర్ణయానికి వచ్చారు. ఈ 'బాబ్రీ మసీదు' జోన్‌పూర్ షర్కీ రాజులు కట్టించిన షాహీ అటల మసీదుకు పూర్తి నకలు (డూప్లికేట్ నమోనా)గా ఉంది. అందువల్ల తెలుసుకోదగ్గ విషయమేమంటే బాబర్‌కు బాబ్రీ మసీదుకు ఎలాంటి సంబంధం లేదని! ఇలాంటి చారిత్రక విషయాలు తెలుసుకోకుండా మిడిమిడి జ్ఞానంతో రాజకీయాలు చేయాలన్న కుట్రతో ఎందరో ఎన్నో మాట్లాడారు. ఇంకా మాట్లాడుతూనే ఉన్నారు. అయితే అవన్నీ అబద్ధాలు.

అయోధ్యను పూర్వం సాకేత్ అని పిలిచేవారు. సాధారణ శకం 5వ శతాబ్దంలో స్కందగుప్తుడు దానికి అయోధ్య అని పేరు పెట్టాడు. 1818 సి.ఇ లో ఫైజాబాద్ జిల్లాకు సంబంధించిన అధికారి దారే ఫరా బక్ష్ ఒక డాక్యుమెంట్ విడుదల చేశాడు. అందులో గూడా హిందూ దేవాలయ-బాబ్రీ మసీదుల ప్రసక్తి లేదు. 1979-80లలో ఆర్కియాలజిస్ట్ బి.బి.లాల్ అయోధ్య ప్రాంతంలో విస్తృతంగా తవ్వకాలు నిర్వహించాడు. ఆయన ఉద్దేశమేమంటే, వాల్మీకి రామాయణంలోని వర్ణనల ప్రకారం అక్కడ ఆధారాలేమైనా దొరుకుతాయేమోనని! వాల్మీకి రామాయణాన్ని నిరూపించాలన్న పట్టుదలతో చాలా కష్టపడ్డారు. రామాయణంలో వాల్మీకి వర్ణించిన ప్రదేశాలు, రాముడికి-సీతకు సంబంధించిన వస్తువులు, వారున్న ఇల్లు వంటి వాటి ఆధారాలు తవ్వి తీద్దామని ఆరాటపడ్డాడు. కానీ ఫలితం దక్కలేదు. సాధారణ శకానికి పూర్వం 8వ శతాబ్దం నుండి కొన్ని ఆధారాలు లభించాయే గాని-అవి రాముడికి సంబంధించినవి కావు. అంత శ్రమకోర్చి చేసిన పనిని బి.బి.లాల్ గ్రంథస్థం చేయలేదు. ఆయన అనుకున్నది దొరకనందుకు బహుశా ఆయనకే నామోషీగా తోచిందేమో-'నథింగ్ ఆఫ్ స్పెషల్ ఇంట్రెస్ట్ వజ్ ఫౌండ్'- అని చెప్పుకున్నాడు. ఇండియన్ ఆర్కియాలజీ రివ్యూ జర్నల్ రెండు సంచికల్లో ఆయన కృషిని కొంత నమోదు చేసింది. అందులో 'నథింగ్' అనే ఉంది. 1969-70 ప్రాంతంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ బృందం అయోధ్యలో కొంత అధ్యయనం చేసిందిగానీ కొత్త సమాచారం ఏదీ ఇవ్వలేక పోయింది.

'సర్వే ఆఫ్ ఇండియా' భారతదేశపు తొలి డైరెక్టర్ జర్నల్ ఆఫ్ ఆర్కియాలజీ అలెగ్జాండర్ కన్నింగ్‌హం దేశ వ్యాప్తంగా తవ్వకాలు జరిపించాడు. ఎక్కడ తవ్వినా బౌద్ధానికి సంబంధించిన శిల్పాలు, స్థూపాలు బయటపడసాగాయి. 1862-63 సి.ఇ లో అయోధ్యలో కూడా తవ్వించాడు. అక్కడ రెండు బౌద్ధ స్థూపాలు, విశాలమైన ఒక బౌద్ధ విహారం బయటపడ్డాయి. వాటిని పరిశీలించి అవి మౌర్య చక్రవర్తి అశోకుడి కాలానివని ఆయన నిర్ధారించాడు. వాస్తవానికి సాకేత్/అయోధ్య ఒక గొప్ప బౌద్ధ క్షేత్రంగా వెలసిల్లిందని చీనా యాత్రికుడు హ్యుయాన్‌త్సాంగ్ చెప్పింది కూడా అదే! 300-400 సి.ఇ మధ్య వెలువడిన బౌద్ధ జాతక కథల ప్రకారం-దశరథుడు, ఆయన కుమారుడు శ్రీరామచంద్రుల రాజధాని అయోధ్య కానేకాదు. వారి రాజధాని వారణాసి! 5-8 సి.ఇ శతాబ్దాల మధ్య మొదటి/పద్నాలుగవ జైన తీర్థంకరుల జన్మస్థానం అయోధ్య! ఇక 1853-55 సి.ఇ ప్రాంతంలో వైష్ణవ భక్తుడు హనుమాన్ ఘడీ బైరాగి-బాబ్రీ మసీదు ఉన్న స్థలమే శ్రీరాముడి జన్మస్థలమని ప్రచారం ప్రారంభించాడు. 1979 సి.ఇ లో అఖిల భారతీయ రామాయణ మహాసభ వారు వారం రోజుల పాటు అయోధ్యలో రామాయణ పారాయణం జరిపించారు. ఆ తరువాత రాముడు-సీత విగ్రహాలు బాబ్రీ మసీదులో పెట్టి వివాదాన్ని పెంచారు. ఆ తర్వాతే పిటిషన్లు-కోర్టు కేసులు ఉధృతమయ్యాయి. నిప్పు లేనిదే పొగ రాదంటారు గానీ, బ్రాహ్మణ వాదం తల్చుకుంటే నిప్పు లేకుండానే పొగ పుట్టించి దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయగలదు. ఇదిగో ప్రత్యక్షంగా చూశాం!

ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే వాల్మీకి సృష్టించిన కల్పిత పాత్ర రాముడు చారిత్రక పురుషుడే కాదు. అతను ఈ దేశంలో పుట్టడమేమిటీ? పుడితే గిడితే వాల్మీకి మెదడులో పుడతాడు కదా? అబద్ధాల పునాది మీద నడుస్తున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అబద్ధాల పైనే అయోధ్య రామాలయం నిర్మిస్తోంది. ఈ బాయిస్(బి) 22 జనవరి (జె) ప్రాణప్రతిష్ట (పి) ప్రభుత్వం ఒక చీకటి లోంచి మరో చీకటి లోకి ప్రవేశించినట్టు 6.12.1992 నుండి 22.1.2024 లోకి ప్రవేశించింది! ఎవరి విశ్వాసాలు వారివి. నేను కేవలం నాకు దొరికిన చారిత్రక ఆధారాలను ప్రజల ముందు పెట్టాను. నమ్మడం నమ్మక పోవడం-వారి ఇష్టం!

/వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్ర వేత్త- మెల్బోర్న్ నుంచి /

సందర్భం

చిత్తడి నేలలను కాపాడుకుందాం

ప్రతి ఏటా ఫిబ్రవరి 2న 'ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం జరుపుకుంటున్నాం. జీవ జాతుల్లో దాదాపు 40 శాతం వరకు చిత్తడి నేలల్లోనే నివసిస్తున్నాయి. చిత్తడి నేలల నుంచే మానవాళికి మంచి తాగే నీరు లభిస్తోంది. ప్రపంచ తాగు నీటి కొరత సంక్షోభాన్ని అధిగమించడానికి చిత్తడి నేలలను కాపాడుకోవడం తక్షణావసరమని తెలుసుకోవాలి. చిత్తడి నేలల్లోకి మంచి నీటి నాణ్యత, లభ్యతల పట్ల సామాన్యులకు అవగాహన కల్పించాలి. వెట్‌లాండ్ ప్రయోజనాల్లో పరిశుద్ధ మంచి నీటి లభ్యత, నీటి కొరత తీర్చడం, జీవావరణ పరిరక్షణ, జీవనోపాధి కల్పన, జీవ వైవిధ్య పరిరక్షణ, తుఫానులను అదుపు చేయడం, కార్బన్ నిల్వలు, వాతావరణ మార్పులు, ఆరోగ్య పరిరక్షణ, పర్యాటకాభివృద్ధి, జలచరాల పోషణ లాంటివని అనేకం వస్తాయి. నివాస యోగ్యమైన భూగోళ పరిరక్షణకు చిత్తడి నేలల్లో భాగమైన చెరువులు, సరస్సులు, కుంటలు, మానవ నిర్మిత నీటి నిల్వలను కాపాడుకోవలసిన కనీస బాధ్యత మనందరి మీద ఉన్నది.

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్:9949700037

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

సుజల స్రవంతి అలైన్‌మెంట్ మార్చకపోతే....

నష్టమే ఎక్కువ


కాలువ ఎలైన్‌మెంట్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య (ఫైల్)

- లోతట్టు ప్రాంతం నుంచి లైన్‌మార్క్
- నీటి వసతికి పరిమిత అవకాశాలు
- భారీగా భూములు కోల్పోనున్న రైతులు
- ఖర్చు తగ్గించుకునేందుకు అవకాశమున్నా పట్టని ప్రభుత్వం
- నేడు ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన సదస్సు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అలైన్‌మెంట్ మార్పు చేయకపోతే ఆ ప్రాజెక్టు వల్ల భూ నిర్వాసిత రైతులకు నష్టం జరగనుంది. ప్రభుత్వానికి కూడా వ్యయ భారం పెరగనుంది. కాలువ మార్కింగ్ ఎగువ ప్రాంతం నుంచి కాకుండా లోతట్టు ప్రాంతం నుంచి చేసేందుకు నిర్ణయించడమే ఇందుకు కారణం. ఈనేపథ్యంలో కాలువ డిజైనింగ్ మార్పు చేయాలంటూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన నిర్వాసిత రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి కాలువల నిర్మాణం చేపట్టడం ద్వారా లక్షిత సాగునీరు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ ఉండబోదని సాంకేతిక నిపుణులు సైతం చెబుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతు సంఘం ఆధ్వర్యాన ప్రభుత్వంపై పోరాటానికి రైతాంగం సన్నద్ధమౌతోంది.

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను సస్యశ్యామలం చేస్తామంటూ 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7,214.10కోట్ల వ్యయంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 8లక్షల ఎకరాలకు సాగునీరు, 2.30లక్షల జనాభాకు రోజుకు 4.46టిఎంసిల తాగునీటితోపాటు మొత్తం సాగునీటిలో 1శాతం నీటిని పారిశ్రామిక అవసరాలకు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందులో అత్యధికంగా సుమారు 3.94లక్షల ఎకరాల మేర ఉమ్మడి విజయనగరం జిల్లాకు రావాల్సివుంటుంది. ఇందులో భాగంగా ఈ జిల్లాలో ప్రభుత్వం తలపెట్టిన కాలువల అలైన్‌మెంట్ వల్ల ఇప్పటికే సాగునీటి సదుపాయం ఉన్న సారవంతమైన భూములు ఎక్కువ మంది కోల్పోనున్నారు. ఇదే కాస్త ఎగువ ప్రాంతంలో తూర్పుకనుమలకు ఆనుకుని కాలువ లైనింగ్ రూపొందిస్తే రైతుల నుంచి సేకరించాల్సిన భూమి తగ్గుతుంది. తద్వారా రైతులతోపాటు భూమి కొనుగోలుకు ప్రభుత్వానికి అయ్యే ఖర్చుభారం తగ్గుతుంది. ఇదే విషయమై ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు చాలా కాలంగా ధర్నాలు తదితర రూపాల్లో నిరసన తెలుపుతూనే ఉన్నారు. రైతులు భావిస్తున్నట్టు ఎగువ ప్రాంతం నుంచి కాలువలు ఏర్పాటు చేయడం ద్వారా లిఫ్ట్‌ల సంఖ్య 6నుంచి 4కు తగ్గడంతోపాటు, వాటి నిర్వహణ అయ్యే ఖర్చు కూడా తగ్గుతుందని సాగునీటి రంగానికి చెందిన సీనియర్ ఇంజినీరింగ్ నిపుణులు ఐఎస్ఎన్ రాజు తదితరులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కాలువ అలైన్‌మెంట్ మార్పుచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై సాగునీటి పారుదలశాఖ అధికారులు, ఆశాఖకు చెందిన రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబులతో ఎపి రైతు సంఘం నాయకత్వంలో రైతులు పలుమార్లు రాయబారం నడిపినా వారు పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో రైతులు తమ పోరాటం తీవ్రతరం చేసేందుకు సన్నద్ధమౌతున్నారు.

ఇదీ అసలు సమస్య

ప్రస్తుతం ప్రభుత్వం చేసిన అలైన్‌మెంట్ మార్కింగ్ తాటిపూడి నుంచి గజపతినగరం, గుర్ల మండలాల మీదుగా సాగుతుంది. దీనికి పైన ఉన్న మెంటాడ, దత్తిరాజేరు, రామభద్రపురం, తెర్లాం, మెరకముడిదాం, బాడంగి, బలిజిపేట, బొబ్బిలి, రాజాం తదితర మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని పంపాల్సివస్తుంది. అదే మెంటాడ, రామభద్రపురం, బొబ్బిలి, బలిజిపేట మీదుగా అలైన్‌మెంట్ మార్చేస్తే ఆండ్రజలాశయం, చంపావతి, వేగావతి, ఏడొంపులగెడ్డ, పోతులగెడ్డ తదితర నదులు, గెడ్డలను అనుసంధానం చేయవచ్చు. తద్వారా నిర్దేశిత ఆయకట్టు పూర్తిస్థాయిలో నీరందించవచ్చు. ఆయకట్టు ప్రాంతంలో 90శాతం భూమి దిగు భాగాన ఉండడం వల్ల లిఫ్ట్‌ల సంఖ్య, కాలువల నిర్మాణానికి ఖర్చు తగ్గుతుందని రైతులు, ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెలించాలి

కాలువల అలైన్‌మెంట్ మార్పుచేయడంతోపాటు ఇందుకోసం సేకరిస్తున్న భూమికి ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు భూమి విలువపై నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. సుజల స్రవంతి కాలువ కోసం ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం 8మండలాల్లో 4,400 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో అలైన్‌మెంట్ మార్పు చేయడంతోపాటు 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలంటూ గ్రామ సభల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

నేడు సదస్సు

గంట్యాడ మండలం తాటిపూడిలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ నిర్వాసిత పోరాట కమిటీ (ఎపి రైతు సంఘం) ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 10గంటలకు సదస్సు జరుగనుంది. ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ హాజరు కానున్నారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు, కోళ్ల లలితకుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులను ఈ సదస్సుకు ఆహ్వానించారు.

స్వలాభం కోసం మంకుపట్టు

ప్రభుత్వ పెద్దలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమే కాలువ అలైన్‌మెంట్ మార్పు విషయంలో ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఖర్చు తగ్గితే వారికి కమీషన్లు తగ్గిపోతాయని భావిస్తున్నారేమో. దీనివల్ల ప్రభుత్వ వ్యయం భారీగా పెరగడంతోపాటు నిర్వహణ కూడా కష్టతరంగా మారుతోంది. అలైన్‌మెంట్ మార్పులవల్ల ఆయకట్టు లక్ష్యానికి దోహదపడుతుందని నిపుణులు చెబుతున్నా వినిపించుకోవడం లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిపుణుల కమిటీవేసి అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి మేలు చేకూర్చాలి.

బుద్ధరాజు రాంబాబు
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఎస్‌బిఐ సిఎస్‌పిలో అవినీతి కలకలం

- గుట్టుచప్పుడు కాకుండా ఐడీ బ్లాక్
- మరో ఐడిలో కొనసాగుతున్న సిఎస్‌పి

ప్రజాశక్తి - చిలమత్తూరు

సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల కేంద్రంలోని పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్‌బిఐకి సంబంధించిన సిఎస్‌పి (ఖాతాదారుల సహాయ కేంద్రం)లో నిర్వహకుడు చేతివాటం ప్రదర్శించి ఖాతా దారుల సొమ్ము కాజేశారు. దీంతో ఆమాయకులైన వృద్ధులు, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళల సొమ్మును లక్షల రూపాయలు కాజేసినట్లు తెలుస్తోంది. కొంతమంది బాధితుల ఫిర్యాదుతో సిఎస్‌పి ఐడీలను సీజ్ చేసినట్లు ఎస్‌బిఐ మేనేజర్ శివయ్య తెలిపారు. తన వద్ద డబ్బు తీయడానికి, లేదా ఖాతాలో సొమ్ము ఎంత ఉంది అన్నది కనుక్కోవడానికి వెళ్లిన ఖాతాదారుల వద్ద బయోమెట్రిక్ వేయించుకొని ఖాతాలోని సొమ్ము ను కొద్దికొద్దిగా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు ఖాతాదారుల ఫిర్యాదుతో చేపట్టిన విచారణలో వాస్తవం తేలడంతో సిఎస్‌పి ఐడీ బ్లాక్ చేశామని వెల్లడించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇరువురి ఐడీలలో ఇలా అవినీతీకి పాల్పడ్డారని అన్నారు. తమకు ఫిర్యాదు చేసిన ఖాతాదారులకి సొమ్మును రికవరి చేయించామని అన్నారు. అయితే ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విషయాన్ని అధికారులు గుట్టు చప్పుడు కాకుండా సిఎస్‌సి ఐడీలు బ్లాక్ చేసి చేతులు దులుపుకున్నారు. అయితే రోజు వారి ఇలాంటి ఫిర్యాదులు ఇంకా అందుతున్నాయని మేనేజర్ అన్నారు. ఎవరైన ఇలా మోసపోయి ఉంటే బ్యాంక్‌లో రాత పూర్వకంగా పిర్యాదు చేయాలని కోరారు. కాగా ఇలా కాజేసిన సొమ్ము లక్షల రూపాయల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అవినీతి తెలిసి పిర్యాదు చేసిన వారి సంగతి సరే అసలు తెలియని చాలామంది రైతులు తమకు ప్రభుత్వ పథకాల ద్వారా రైతు భరోసా పేరిట పడ్డ సొమ్ము తమ క్రాప్ లోన్‌లకు జమా అయిందని మోసపోయారని తెలుస్తోంది. అలాగే మహిళలు తమ స్వయం సహాయక సంఘాల పొదుపు అప్పులకు జమ అయిందని మోసపోయినట్లు తెలుస్తోంది. ఇలాంటి వారు బ్యాంక్‌లో స్టేట్‌మెంట్ తీసుకోవడం ద్వారా సరిచూసుకోవచ్చు అని మేనేజర్ అన్నారు. అయితే సిఎస్‌పి ఐడి సీజ్ చేశామని బ్యాంక్ మేనేజర్ చెబుతున్నప్పటికి యథాస్థానంలో సిఎస్‌పి పాయింట్ కొనసాగుతుండటం ఆశ్చర్యం కల్గిస్తుంది. దీనిపై ఎస్‌బిఐ మేనేజర్‌ని వివరణ కోరగా వారు హిందూపురానికి చెందిన బ్యాంక్ ఐడితో కొనసాగిస్తున్నారని అన్నారు. అది తమ బ్రాంచ్‌కి సంబంధం లేని కారణంగా సీజ్ చేయలేకపోయామన్నారు.

ఆదాయం ఉన్నా..అభివృద్ధి సున్నా

- ఎఎంసిల్లో పనులకు మంజూరు కాని నిధులు
- పశువైద్య శిబిరాలకు మంగళం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీల ప్రాబల్యం నానాటికీ తగ్గిపోతోంది. లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయం సమకూరుతున్నా రైతుల ప్రయోజనాలు నానాటికీ తగ్గిపోతున్నాయి. రోజులు గడిచే కొద్దీ మార్కెట్ కమిటీల అభివృద్ధి కుంటుపడుతోంది. కాకినాడ అర్బన్, కరప, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురంలో తొమ్మిది మార్కెట్ కమిటీలున్నాయి. గతంలో కొన్ని మార్కెట్ కమిటీలు రెండేసి నియోజకవర్గాల్లో ఉండేవి. పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు ఒక్కో నియోజకవర్గానికి ఒక మార్కెట్ కమిటీ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది రూ.36.26 కోట్లు మార్కెట్ సెస్ వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 65 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రతి సంవత్సరం ఆదాయం పెరుగుతూ వస్తుంది. లక్ష్యాలను సాధించడంలో ఎఎంసిలు ముందుంటున్నాయి. గతంలో చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఫలితంగా పాలకవర్గాలు మరింత నిరుత్సాహపడ్డాయి. కేంద్రం మళ్లీ చెక్ పోస్టులకు అవకాశం కల్పించడంతో ఎఎంసిల ఆదాయం పెరుగుతుండడంతో లక్ష్యాలను చేరుకుంటున్నాయి. మార్కెట్ కమిటీల అభివృద్ధికి మాత్రం ప్రాధాన్యం ఇవ్వలేకపోతున్నాయి. ప్రతి మార్కెట్ కమిటీ ఆదాయంలో 20 శాతం రైతుల ప్రయోజనాలకు వెచ్చించాలన్న నిబంధనను వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టింది. గతంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రైతులకు సేవలందించేవారు. పశువైద్య శిబిరాల ద్వారా పాడి రైతులకు మందులు అందించేవారు. కానీ నాలుగేళ్లుగా పశు వైద్య శిబిరాల జాడ కనిపించడం లేదు. పాడి రైతులకు సహకారం కరువైంది. దీంతో ప్రైవేట్ వైద్య సదుపాయాలపైనే ఈ రైతులు ఆధారపడాల్సి వస్తోంది. పుంత రహదారుల అభివృద్ధి కూడా గత నాలుగేళ్లుగా నిలిచిపోయింది. గతంలో కొంత రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేసిన ప్రభుత్వం నుంచి ఆమోదం లభించకపోవడంతో వాటి పనులు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించే వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీల గోదాముల్లో ఉత్పత్తులను దాచుకుని మంచి ధర వచ్చిన తర్వాత అమ్ముకోవచ్చు. గతంలో రైతుబంధు పథకం ద్వారా ఈ వెసులుబాటు ఉండేది. అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో పలువురు రైతుల తమ ఉత్పత్తులను తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాలో 16 గోదాముల ఉన్నాయి. ఇవి 15,055 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని నిండి ఉన్నప్పటికీ రైతులు ఎవరూ వీటిని సక్రమంగా ఉపయోగించుకోలేకపోతున్నారు. మరోవైపు ఏళ్ల తరబడి కమిటీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదు. జిల్లావ్యాప్తంగా 77 మందికి గానూ 22 మంది మాత్రమే పని చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 75 మంది వరకూ పని చేస్తున్నారు. జూనియర్ మార్కెట్ సూపర్ వైజరు నుంచి మార్కెట్ కమిటీ కార్యదర్శి వరకూ ఖాళీలు ఉన్నాయి.

ఈ-విక్రయాలు నిల్

రైతులు పండించిన ఉత్పత్తులను ఆన్ లైన్ ద్వారా కొనుగోలు చేయడంతో పాటు మంచి ధర కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ-విక్రయాలు (ఈ-ఫామ్ మార్కెటింగ్) మూడేళ్ల క్రితం ప్రారంభించింది. దీని ద్వారా రైతుల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ కార్యక్రమం మధ్యలో నిలిచిపోయింది. అప్పటి నుంచి విక్రయాల ఊసెత్తడం లేదు.

పంట పొలాలపై జంట ఏనుగుల దాడి

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు మొరవ వద్ద ఉన్న పలువురి రైతుల పంట పొలాలలో జంట ఏనుగులు బుధవారం రాత్రి ధ్వంసం చేశాయి. అరటి, చెరకు, మామిడి పంటలను ధ్వంసం చేశాయి. ఇరికిపెంట (పార్వతి నగర్) బంగ్లాకు చెందిన రాజన్న తన అరటి తోటకు సాయంత్రం వెళ్లారు. రెండు ఏనుగులు తమ పంట వైపు రావడాన్ని గమనించి ఫారెస్ట్ సిబ్బంది విషయాన్ని తెలిపారు. వారు రాగానే వారితో కలిసి 15మంది రైతులు టపాసులు పేలుస్తూ ఏనుగులను తరిమేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. ఏమాత్రం బెదరని జంట ఏనుగులు వారి మీదికే దాడి చేసేందుకు వస్తూ రాజన్న అరటి పంటను పూర్తిగా ధ్వంసం చేసి పక్కనే ఉన్న మరొక రైతుకు చెందిన చెరకు పంటపై, సమీపంలోని మామిడి తోటను ధ్వంసం చేసి వెళ్లిపోయాయి.

అందరికీ నిరాశే

- ఎంఎ బేబీ



కాసర్‌గోడ్ : కేరళకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో ఏమీ లేదని, అంబానీ, అదానీలాంటి వారిని మినహా మిగిలిన అందరినీ బడ్జెట్ నిరాశపరిచిందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ చెప్పారు. ప్రజలను ఆకట్టుకోవడానికి నరేంద్ర మోడీ ఇప్పటి వరకు ఏం చేశారో కూడా ఈ బడ్జెట్‌లో చూడవచ్చునని తెలిపారు. ఈసారి కూడా ఆర్థిక సర్వే సమర్పించలేదని పేర్కొన్నారు. ఆర్థిక గణాంకాల విడుదలను నిలిపివేశారని గుర్తు చేశారు.

పాత అంశాలకు కాపీ పేస్ట్

- కెఎన్ బాలగోపాల్

తిరువనంతపురం : కేంద్ర బడ్జెట్ పాత విషయాలకు కాపీ పేస్ట్ మాత్రమేనని, ఆర్థిక పత్రాలు సభకు రాలేదని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ అన్నారు. భారతదేశం మొత్తం మీద ఆర్థిక స్తబ్దత ఉందని, కేరళలో కూడా ఉందని తెలిపారు. మాంద్యాన్ని ఎదుర్కొనేందుకు ప్యాకేజీని కేంద్రం ప్రకటించాల్సి ఉందని, కేరళ కూడా ఎంతో ఆశతో ఎదురుచూస్తోందని మంత్రి అసెంబ్లీలో అన్నారు. ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి పథకాలు లేవని చెప్పారు. దేశం ఆరోగ్యకరంగా సాగడం లేదని మంత్రి అన్నారు. రాష్ట్రం సమర్పించిన పథకాలకు కేంద్రం నుంచి నిధులు రాలేదని తెలిపారు. అదే సమయంలో కేంద్రం నుంచి రూ.30 వేల కోట్ల వరకు అందిన రాష్ట్రాలు కూడా ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. 'బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పన కూడా లేదు. ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు మేలు చేసేది బడ్జెట్‌లో లేదు. రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో కేంద్రం వివక్ష చూపుతోంది. కేరళకు బడ్జెట్ నిరాశపరిచింది. సిల్వర్ లైన్ అనేది కేంద్రానికి సంబంధించిన అంశం. స్థానిక బిజెపి నాయకులు చూస్తున్నట్లుగా కాకుండా భారతదేశంలోని పాలకులు సమస్యను చూడాలని' మంత్రి అన్నారు.

ప్రభుత్వ రంగంలో
పెట్టుబడుల ఉపసంహరణ జోరు

- డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.50 వేల కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ : ఎన్నికల వేళ కూడా ప్రభుత్వ రంగ సంస్థ(పిఎస్‌యు)ల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవడం (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా నిధులు సమీకరించాలని మోడీ సర్కార్ నిర్ణయించింది. ఈ దఫా ఏకంగా రూ.50 కోట్ల మేర డిజిన్వెస్టెమెంట్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లో మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థల్లోని రూ.50వేల కోట్ల విలువ చేసే వాటాలను ప్రయివేటుకు విక్రయించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రస్తుత 2023-24లో రూ.30,000 కోట్ల వాటాలను ఉపసంహరించుకోనున్నట్లు తెలిపారు. గతేడాది బడ్జెట్ సమయంలో రూ.51,000 కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత పెరగడంతో డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ వేగాన్ని తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 7 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీ వాటాలను విక్రయించడం ద్వారా రూ.12,504 కోట్లు తన ఖజానాలో వేసుకుంది. వాటాలను విక్రయించిన వాటిల్లో కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పిసి, ఆర్‌విఎన్‌ఎల్, ఐరెడా ఉన్నాయి. కాగా మార్చి ముగింపు కల్లా మొత్తంగా రూ.30వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని పూర్తి చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. మోడీ ప్రభుత్వం 2017-18లో రికార్డ్ స్థాయిలో రూ.1,00,056 కోట్ల విలువ చేసే పిఎస్‌యుల వాటాలను విక్రయించింది. అప్పటి బడ్జెట్‌లో పెట్టుకున్నదాని కంటే ఇది చాలా ఎక్కువ. 2018-19లో రూ.84,972 కోట్ల వాటాలను ఉపసంహరించుకుంది.

ఓటరు తుది జాబితాలో తప్పులు సరిదిద్దాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓటరు తుది జాబితాలోని తప్పులను సరిదిద్దాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య గురువారం లేఖ రాశారు. నెల్లూరు, మైలవరం, చిత్తూరు, ఎచ్చెర్ల, చంద్రగిరి, పొన్నూరు, విజయవాడ తూర్పు, పలమనేరు, పాణ్యం, విశాఖపట్నం, నర్సారావుపేట, పెద్దాపురం, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని తప్పులను సరిదిద్దాలని కోరారు. నెల్లూరులో 17 ఏళ్ల బాలుడికి ఓటు హక్కు కల్పించారని, మైలవరం నియోజకవర్గంలో వలసవెళ్లిన వారి ఓట్లను తొలగించలేదని పేర్కొన్నారు. చిత్తూరు, పులిచర్లలో చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించలేదని వివరించారు. పలమనేరులో టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగించారని, పుంగనూరులో మృతులకు ఓటు హక్కు కల్పించారని తెలిపారు. ఎచ్చెర్లలో ఒకే భవనంలో 350 మంది నివాసం ఉంటున్నట్లు చూపారని పేర్కొన్నారు. చంద్రగిరిలో పోలింగ్ స్టేషన్ 322లో దాదాపు 44 మంది ఓట్లు గుర్తించడమే కష్టంగా ఉందని తెలిపారు.

జిఓ 3పై అప్పీల్‌కు వెళ్లని ప్రభుత్వం : ధారునాయక్

గిరిజనులకు మేలు కలిగే జిఓ 3ను సుప్రీంకోర్టు కొట్టేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అప్పీల్‌కు కూడా వెళ్లలేదని టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు ఎం ధారునాయక్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం వదిలింది దగా డిఎస్‌సి అని టిడిపి అధికార ప్రతినిధి దాసరి శ్యామచంద్ర విమర్శించారు. 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, కేవలం 6,100 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంచించడం కాదా? అని ప్రశ్నించారు.

గ్రామీణ పేదలకు మరణ శాసనం ఈ బడ్జెట్

- పట్టణ ఉపాధి ఊసే లేదు
- బడ్జెట్ నిధులు పెంపు కోసం, ధనవంతుల బడ్జెట్‌కు వ్యతిరకంగా దేశవ్యాప్తంగా నిరసనలు
- అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు మరణ శాసనాన్ని బిజెపి ప్రభుత్వం విధించిందని, పేదలకు నిధులు కేటాయింపులు పెంచకుండా గత సవరించిన బడ్జెట్ కంటే తక్కువ నిధులను కేటాయించి, నిధులు పెంచి ఇచ్చామని అబద్ధాలతో వాస్తవాలు విస్మరిస్తున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. 'ఈ ఏడాది సవరించిన బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి రూ.87 వేల కోట్లు కేటాయించారు. పేదలు పని చేసిన దానికి ఇంకా రూ.15 వేల కోట్లు బాకాయిలు ఉన్నవి. వాటి బకాయిలు కలుపుకుని పేదలు పనిచేసిన దానికి ఏడాదికి రూ.లక్ష కోట్లు అవసరం అవుతాయి. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో ఇప్పటి ఖర్చు కంటే తక్కువ కేటాయించి ఎక్కువ కేటాయించామని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రూ.2 లక్షల కోట్లు అవసరం అని నిపుణులు చెప్పారు. ఈ నిధులతో 1/3 వంతు కార్మికులు ఉపాధి లేక, పనికి దూరం అవుతారు' అని వెంకట్ అన్నారు. ధనవంతులను ఇంకా ధనవంతులుగా మార్చే బడ్జెట్ అని, కార్పొరేట్ ప్రభుత్వం అని అన్నారు. పేదలకు ఇచ్చే పథకాలన్నింటికీ నిధులు కోత పెడుతున్నారని, ప్రజా పంపిణీ వ్యవస్థ, విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, ఉపాధికి నిధులు కేటాయించడం లేదన్నారు. ఈ బడ్జెట్ నిధుల కోతకు నిరసనగా దేశ వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగార్థుల నిరసనతో పాట్నాలో 144 సెక్షన్ అమలు

పాట్నా : రైల్వే ఉద్యోగ అభ్యర్థుల నిరసనల తరువాత బీహార్ రాజధాని పాట్నాలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5 వరకూ 144 సెక్షన్ విధించారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుతీరిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సోమ, మంగళవారాల్లో పాట్నాలో వివిధ ప్రాంతాల్లో రైల్వే ఉద్యోగ అభ్యర్థులు ఆందోళనలకు దిగారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల 5,696 అసిస్టెంట్ లోకో పైలట్ల పోస్టుల కోసం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌పై అసంతృప్తితో వేలాదిమంది నిరుద్యోగులు వరుసగా రెండు రోజుల పాటు నిరసనలకు దిగారు. ఉద్యోగాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పాట్నాలోని గాంధీ మైదాన్ సమీపంలోని కార్గిల్ చౌక్, అశోక్ రాజ్‌పథ్, బిఖ్నా పహారి, లంగర్ టోలీతో సహా అనేక ప్రాంతాల్లో ఈ నిరసనలు జరిగాయి. విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఎక్కడికక్కడ వారిపై విరుచుకుపడి, చెదరగొట్టారు.



దీక్షా శిబిరం వద్ద నినదిస్తున్న కార్మికులు

విశాఖ ఉక్కు జోలికొస్తే సహించం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 1085వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ కన్‌స్ట్రక్షన్, ట్రాఫిక్, ఆర్‌ఎండి విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా డి.ఆదినారాయణ మాట్లాడుతూ..ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుకు కట్టబెట్టడమే కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందని విమర్శించారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో సమర్థించుకోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కుపై కన్ను పడినందుకే అదానీ పతనం ప్రారంభమైందన్నారు. ఈ దేశంలో మోడీకి అండగా నిలిచిన రాజకీయ పార్టీలు అధోగతి పాలుకాక తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగా ఉత్పత్తిని తగ్గించి, కొన్ని విభాగాలను మూసివేసి నష్టాల వైపు నడుపుతున్నారని ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ, ప్రమోషన్లు కల్పించకుండా అనేక అవరోధాలు కల్పిస్తూ పారిశ్రామిక అనిశ్చితికి కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. దీక్షా శిబిరంలో నాయకులు డి.హరినాథ్, ఎస్.ఈశ్వరరావు, పి.అప్పారావు ఆర్.శ్రీనివాసరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జానపద వృత్తి కళాకారుల పోరాటం

సాకారమైన అఖండ శివనామ సంకీర్తన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జానపద వృత్తి కళాకారుల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. 'స్వయంభు' చెంత అఖండ శివనామ సంకీర్తన చేసేందుకు ఆమోదం లభించింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలోని సాంస్కృతిక కళావేదికపై గురువారం జానపద వృత్తి కళాకారుల సంకీర్తన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. తిరుపతి జిల్లా జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుమల తరహాలో ముక్కంటి చెంత అఖండ శివనామ సంకీర్తన జరపాలంటూ ఏడాది పాటు పోరాటం చేసిన సంగతి తెలిసిందే. వీరికి తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి సంపూర్ణ మద్దతు తెలిపారు. దీంతో అఖండ శివనామ సంకీర్తన చేసేందుకు ఆలయం అనుమతినిచ్చింది. ఆ మేరకు తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన జానపద వృత్తి కళాకారులు సాంస్కృతిక కళావేదికను హోరెత్తించారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు మురళి, జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య, గెడి వేణు తదితరులు పాల్గొన్నారు.



'విశ్వంభర' కసరత్తు

హీరో చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఆయనకు ఇది 156వ చిత్రం. యువి క్రియేషన్స్ పతాకంపై వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అయితే ఇంకా చిరు మాత్రం ఇంకా సెట్స్‌లోకి వెళ్లలేదు. ఈ సినిమా కోసం చిరంజీవి జిమ్‌లో చేస్తున్న కసరత్తులతో కూడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. 'రెడీ ఫర్ విశ్వంభర' అంటూ సందేశం చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ కోసం భారీ సెట్‌ను చిత్ర నిర్మాతలు ఏర్పాటుచేశారు. ఈ సినిమాలో చిరంజీవి పేరు 'భీమవరం దొరబాబు' అని ప్రచారం. 2025 సంక్రాంతికి ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తామని చిత్ర నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు.

తెలుగు నేపాలీ చిత్రంలో బ్రహ్మానందం



బ్రహ్మానందం నటించిన తెలుగు నేపాలి మూవీ 'హ్రస్వ దీర్ఘ' విడుదలకు సిద్ధమైంది. గురువారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల తేదీ ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 27న ఈ చిత్రం రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటిస్తూ ఓ ఫొటో విడుదల చేశారు. ఈ సినిమాకి చంద్ర పంత్ దర్శకత్వం వహించగా కబీర్ లాల్ డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా వ్యవహరించారు. హరిహర్ అధికారి స్టోరీ అందించారు. నీతా దుంగనా నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాలో హరిహర్ అధికారి, నీతా దుంగనా, బ్రహ్మానందం, ప్రదీప్ రావత్, సునీల్ వర్మ కబీర్ దుల్హన్ సింగ్ వంటి వారు కీలక పాత్రలలో నటించారు.

23న సుందరం మాస్టర్ విడుదల



ఆర్‌టీటీమ్ వర్క్స్, గోల్డెన్ మీడియా పతాకంపై హీరో రవితేజ, సుధీర్‌కుమార్ కుర్రు నిర్మిస్తున్న చిత్రం సుందరం మాస్టర్. హర్ష చెముడు, దివ్యశ్రీ పాద ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఒక గ్రామంలో కష్టపడే ఉపాధ్యాయుడి చుట్టూ సుందరం మాస్టార్ కథ తిరుగుతుంది. ఈనెల 23న ఈ సినిమా విడుదల కానుంది. కళ్యాణ్ సంతోష్ కొత్తగా దర్శకత్వం వహిస్తున్నారు. దీపక్ ఎరెగడ సినిమాటోగ్రఫీ, శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని అందించారు.



విజయ్‌తో ఎంతో అనుబంధం

హీరో విజయ్ దేవరకొండతో తనకు ఎంతో అనుబంధం ఉందని హీరోయిన్ రష్మిక మందన్న చెప్పారు. తాజా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'విజయ్ నేనూ ఇద్దరం నటులుగా పెరిగాము. ఆయన నాకు బాగా కావాల్సినవాడు. నా జీవితంలో తన పాత్ర చాలా ముఖ్యమైంది. నా జీవితంలో నేను ఏమి చేసినా అందులో విజయ్ కంట్రిబ్యూషన్ ఖచ్చితంగా ఉంటుంది. నేను చేసే ప్రతి పనిలో తన సలహా తీసుకుంటాను. అతని అభిప్రాయం నాకు ఎంతో అవసరం' అని వివరించారు.

5 నిమిషాల పాటు చప్పట్లు కొట్టారు



వెట్రిమారన్ తెరకెక్కించిన 'విడుదలై -1' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'విడుదలై-2' చిత్రం త్వరలో విడుదల కానుంది. అయితే థియేటర్ రిలీజ్ కన్నా ముందు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కి ఈ చిత్రం వెళ్లనుంది. ఈ నేపథ్యంలో తాజాగా బుధవారం రాత్రి రొట్టెర్ డామ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదలై పార్ట్ 1, 2 సినిమాలు ప్రీమియర్ షోలు వేశారు. షో చూసిన ప్రేక్షకులు లేచి నుంచొని దాదాపు 5 నిమిషాల పాటు చప్పట్లు కొట్టి చిత్ర యూనిట్‌ని అభినందించారు. ప్రదర్శన తరువాత ప్రేక్షకులతో కలసి తీసుకున్న ఫొటోని చిత్రబృందం సోషల్‌మీడియాలో విడుదల చేసింది. ఈ సిరీస్‌లో విజయ్ సేతుపతి, సూరి ప్రధాన పాత్రలో నటించారు. ఇంకా విడుదల తేదీ ప్రకటించని ఈ చిత్రాన్ని తెలుగులో గీత ఆర్ట్స్ రిలీజ్ చేస్తోంది.

'యానిమల్ పార్క్' కథ సిద్ధం



బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్లో తెరకెక్కిన 'యానిమల్' చిత్రానికి సీక్వెల్‌గా ప్రకటించిన 'యానిమల్ పార్క్'కి కథ సిద్ధమైంది. ఈ స్క్రిప్ట్ పనిని పూర్తిస్థాయిలో ముగించడం కోసం త్వరలో సందీప్ రైటర్స్‌తో సమావేశం అవ్వనున్నట్లు తెలుస్తోంది. మొదటి భాగంలో రణవిజయ్ పాత్రకు, తన భార్య గీతాంజలి, వాళ్ల కొడుకుకు మధ్య రిలేషన్షిప్‌ని 'యానిమల్ పార్క్'లో మరింత స్పష్టంగా చూపించబోతున్నారని సమాచారం. చిత్ర షూటింగ్ 2025లో ప్రారంభం కానుందని సమాచారం.

ఇండియా కూటమితోనే రాజ్యాంగానికి రక్షణ

- కేంద్రం తీరుపై పలువురు ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో బిజెపి పాలనతో రాజ్యాంగానికి పెనుముప్పు వస్తోందని, ఇండియా కూటమి ద్వారానే రాజ్యాంగానికి రక్షణ లభిస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల హక్కులు హరించి వేస్తున్న కేంద్రం తీరుకు వ్యతిరేకంగా గురువారం విజయవాడలోని ఓ హోటల్లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన మూడుపార్టీలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బిజెపిని బలపరుస్తున్నాయని అన్నారు. సిపిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల హక్కులు కాపాడాలంటే కేంద్రంలో ఉన్న బిజెపిని ఓడించాలని కోరారు. సిపిఐ నాయకులు జల్లి విల్సన్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ పూర్తి అరాచక పాలన చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, సిరివెళ్ల ప్రసాదు, వేర్వేరు సంఘాల నాయకులు గోపీనాథ్, మూర్తి, కాటం నాగభూషణం, మన్నవ హరిప్రసాదు, మేళం భాగ్యారావు, నేతి మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎలాంటి నోటీసు లేకుండానే ఢిల్లీలో 600 ఏళ్ల పురాతన మసీదు కూల్చివేత

న్యూఢిల్లీ : ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే 600 ఏళ్ల పురాతన మసీదును ఢిల్లీ డెవలెప్‌మెంట్ అథారిటీ (డిడిఎ) అధికారులు కూల్చివేశారు. ఢిల్లీలోని మెహ్రౌలీ వద్ద బుధవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. తెల్లవారుజామున ఆకస్మికంగా భారీ సంఖ్యలో పోలీసులను వెంటపెట్టుకుని వచ్చిన డిడిఎ అధికారులు చాలా వేగంగా మసీదును నేల మట్టం చేశారు. ఈ కూల్చివేతకు ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వలేదని మసీదు ఇమామ్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. మసీదులో ఖురాన్, చదువుకునే విద్యార్థుల కోసం మదర్సా, గౌరవనీయులైన వ్యక్తుల సమాధులు ఉన్నాయని, వీటిని కూడా అధికారులు నేలమట్టం చేశారని చెప్పారు. మదర్సాలో చదువుతున్న 22 మంది విద్యార్థులకు చెందిన ఆహారాలు, దుస్తులు వంటి వస్తువులను కూడా అధికారులు ధ్వంసం చేశారని ఇమామ్ పేర్కొన్నారు. కూల్చివేత సమయంలో తన నుంచి, ఆ ప్రాంతంలో ఉన్న ఇతర వ్యక్తుల ఫోన్లను పోలీసులు, అధికారులు బలవంతంగా లాక్కున్నారని, దీని కారణంగా మసీదు కూల్చివేతను ఎవరూ ఫోటోలు, వీడియోలు కూడా తీయలేకపోయారని తెలిపారు. మసీదు, శ్మశానవాటిక, చట్టబద్ధమైన వక్ఫ్ ఆస్తులను కూల్చివేయవద్దని డిడిఎకు ఇటీవల ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా ఈ ఘటన జరగడం గమనార్హం. మసీదు కూల్చివేతను పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

హేమంత్ సోరేన్ కస్టడీపై తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాలను ఎలా మైనారిటీలో పడేయాలి, ఫిరాయింపుల్ని ఎలా ప్రోత్సహించాలి, ఈ చర్యలకు ఎలా ప్రేరణ కలిగించాలి అనేదే ఆ అంశం' అని ఎద్దేవా చేశారు. హేమంత్ సోరేన్ రాజీనామా అనంతరం జార్ఖండ్‌పై అనేక గంటలుగా నిశ్శబ్దత నెలకొన్నదని మనుసింఘ్వీ చెప్పారు. శాసనసభలో అధికార పక్షానికి 47-48 మంది, ప్రతిపక్షానికి 33 లేదా 32 మంది ఉన్నారని స్పష్టమైందని గుర్తు చేశారు. అయినా గవర్నర్ ఇప్పటి వరకూ ఎందుకు చర్య తీసుకోలేదని నిలదీశారు. మెజారిటీ శాసనసభ్యులు మద్దతు లేఖలు ఇచ్చినప్పటికీ ఎందుకింత ఆలస్యం జరుగుతోందో అర్థం కావడం లేదని అన్నారు. 'మీరు ప్రధాని లేదా హోం మంత్రి కార్యాలయం నుండి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారా? లేక ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులు జరపడం కోసం చూస్తున్నారా? ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని తొలగించి రాష్ట్రపతి పాలన విధించేందుకు వేచి ఉన్నారా?' అంటూ గవర్నర్‌పై మనుసింఘ్వీ ప్రశ్నల వర్షం కురిపించారు.

కదంతొక్కిన విద్యార్థి లోకం

- ఎన్ఇపిని తిరస్కరించాలి, విద్యారంగాన్ని కాపాడాలి
- ర్యాలీని ప్రారంభించిన మంత్రి ఉదయనిధి స్టాలిన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉదయనిధి స్టాలిన్

జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి)ని వ్యతిరేకిస్తూ తమిళనాడు రాజధాని చెన్నైలో విద్యార్థి లోకం కదంతొక్కింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని రాష్ట్రాల నుండి వేలాది మంది విద్యార్థులు యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన గురువారం 'ఎన్ఇపిని తిరస్కరించండి, విద్యా రంగాన్ని కాపాడండి...బిజెపిని తిరస్కరించండి, ఇండియాను కాపాడండి' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి శాఖా మంత్రి ఉదయనిధి స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల విద్యా శాఖ మంత్రి అనిల్ మహేష్ పొయ్యమిళి, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిశ్వాస్, ఇతర విద్యార్థి సంఘాల నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. 16 విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడిన బహిరంగ సభతో ర్యాలీ ముగిసింది. ఎస్ఎఫ్ఐ తరపున అఖిల భారత అధ్యక్షుడు విపి సాను మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సమాఖ్య నిర్మాణంపై దాడి చేసేందుకు గవర్నర్ల వంటి యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి జి. అరవిందస్వామి మాట్లాడుతూ ప్రగతిశీల, ప్రజాస్వామిక విద్యార్థి సంఘాలు ఎన్ఇపికి వ్యతిరేకంగా పోరాటాన్ని బలంగా చేపట్టాలని, ప్రభుత్వ విద్యను రక్షించాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి దీప్సితా ధర్ మాట్లాడుతూ, "కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వ్యాప్తి చేస్తున్న ద్వేషం, మతం ఎజెండా మాకు వద్దు. మాకు విద్యార్థుల అజెండా కావాలి" అని అన్నారు.

రైల్వే అభివృద్ధికి రూ.9,138 కోట్లు

- రైల్వేజోన్‌పై ఎపి సర్కారును ప్రశ్నించండి
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర బడ్జెట్‌లో ఎపిలో రైల్వే అభివృద్ధి కోసం రూ.9,128 కోట్లు కేటాయించినట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎపిలో వివిధ పెట్టుబడుల రూపంలో రూ.68,059 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. 2009 నుంచి 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సరాసరిగా ఉమ్మడి ఎపి (ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి) కేవలం రూ.886 కోట్లు కేటాయించిందని చెప్పారు. కాంగ్రెస్ హయాంతో పోల్చితే కేటాయింపులు దాదాపు 10 రెట్లు పెరిగాయన్నారు. గురువారం నాడిక్కడ రైల్వే భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఎపికి కేటాయించిన నిధుల వివరాలను వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో ఏడాదికి 70 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ నిర్మాణం పూర్తయితే, ప్రస్తుతం 246 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ట్రాక్ నిర్మాణంలో 97 శాతం వృద్ధి నెలకొందని చెప్పారు. అమృత్ స్టేషన్స్ స్కీం కింద రాష్ట్రంలోని 72 రైల్వే స్టేషన్లను ఆధునీకరించినట్లు తెలిపారు. అలాగే 709 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లను పూర్తి చేశామన్నారు. 88 ఫుట్ ఓవర్ బ్రిడ్జలు నిర్మించామన్నారు. 109 వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు.

స్థలం అప్పగించిన వెంటనే పనులు

విశాఖపట్నంలో రైల్వేజోన్ ఏర్పాటుకు 53 ఎకరాల భూమి కావాలని, స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని అన్నారు. స్థలం అప్పగించిన వెంటనే రైల్వేజోన్ పనులు ప్రారంభిస్తామన్నారు. డిపిఆర్ ఇప్పటికే పూర్తయిందని, నిధుల మంజూరు మిగిలి ఉందన్నారు. ఐదేళ్లు పూర్తి అయిందన్న వాదనలపై స్పందించిన మంత్రి, తమను ఎందుకు నిలదీస్తున్నారని, ఎపి ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇవ్వకపోతే ఏ విధంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని అన్నారు.

ఎలక్ట్రిక్ వాహన రంగానికి నిరాశ

- సబ్సిడీల కొనసాగింపుపై అస్పష్టత
- ఛార్జింగ్ స్టేషన్లు పెంచుతాం : మంత్రి



న్యూఢిల్లీ : బడ్జెట్‌లో విద్యుత్ వాహన (ఇవి) రంగానికి కేంద్ర బడ్జెట్ నిరాశను మిగిల్చింది. ఎలాంటి ప్రోత్సాహకాలు ప్రకటించకపోవడమే ఇందుకు నిదర్శనం. గురువారం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2024 మధ్యంతర బడ్జెట్‌లో ఆటోమొబైల్ రంగానికి మొండి చెయ్యి చూపారు. ఈ రంగానికి పెద్ద పీట వేస్తారని ఆశించిన వర్గాలకు నిరాశనే మిగిలింది. విద్యుత్ వాహన రంగానికి ఫేమ్ సబ్సిడీ కొనసాగిస్తారని పరిశ్రమ వర్గాలు భావించాయి. కాగా.. బడ్జెట్ ప్రతిపాదనల్లో ఆటోమొబైల్ రంగానికి సంబంధించిన పెద్ద ప్రకటనలు వెలుపడలేకపోవడంతో ఉసూరు మన్నారు. ఇవి రంగానికి కల్పిస్తున్న ఫేమ్ 2 సబ్సిడీ పథకం ముగిసిన తరువాత ఫేమ్ 3 సబ్సిడీ పథకం కింద ఇవి ప్రోత్సాహకాలను అందిస్తామని మాత్రం కేంద్రం బడ్జెట్‌లో ప్రకటన చేయకపోవడంతో ఆ రంగం తీవ్ర విస్మయాన్ని వ్యక్తం చేస్తోంది. కాగా.. విద్యుత్ వాహనాలను విస్తరించడానికి.. కొత్త ఇవిల తయారీకి మాత్రమే కాకుండా ఛార్జింగ్ వంటి వాటికి మద్దతు కల్పిస్తామని మంత్రి సీతారామన్ బడ్జెట్‌లో వెల్లడించారు. విద్యుత్ వాహనాల వినియోగానికి కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజా రవాణా కోసం విద్యుత్ బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. కాగా.. ఇందుకోసం ప్రత్యేక వ్యయాలు, స్పష్టమైన విధానాన్ని ప్రకటించకపోవడంతో అస్పష్టత నెలకొంది.

రామ మందిరం వేడుకపై నిరసన తెలిపిన విద్యార్థిపై ఏడాది వేటు

కోజికోడ్ : అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవ వేడుకకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన ఒక విద్యార్థిపై కేరళలోని కోజికోడ్ - ఎన్ఐటి ఏడాది పాటు నిషేధం విధించింది. ఈ విద్యాసంస్థలో బిటెక్ నాలుగో ఏడాది విద్యార్థి వైశాఖ్ ప్రేమ్ కుమార్ గత నెల 22న రామమందిరం ప్రారంభోత్సవానికి వ్యతిరేకంగా ప్లకార్డుతో నిరసన తెలిపాడు. 'ఇండియా అంటే రామరాజ్యం కాదు' అని ప్లకార్డుపై రాసి ఉంది. ఇలా నిరసన వ్యక్తం చేసినందుకు కొంతమంది విద్యార్థులు ఇప్పటికే ప్రేమ్‌కుమార్‌పై దాడికి కూడా పాల్పడ్డారు. ప్రేమ్‌కుమార్ చర్య క్యాంపస్‌లో అశాంతికి కారణమయిందని, క్యాంప్ గౌరవాన్ని తగ్గించడానికి ప్రయత్నించాడని ఆరోపిస్తూ, ఏడాది పాటు సస్పెండ్ చేస్తూ డీన్ ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టల్‌తో సహా క్యాంపస్ ప్రాంగణంలోకి ఏడాది పాటు ప్రవేశించకుండా నిషేధం విధించారు.

ఆదాయపు పన్నుపై ఆశలు నెరవేరలేదు

- దీర్ఘకాల దృష్టితో బడ్జెట్ రూపకల్పన
- ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్



మాట్లాడుతున్న మీరా జయదేవ్

హైదరాబాద్ : బడ్జెట్‌లో ఆదాయపు పన్ను చెల్లింపుదారులందరూ కొన్ని ప్రయోజనాలను ఆశించారని పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ అన్నారు. ఐటిలో స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని పెంచడంతో పాటు పన్ను శ్లాబులను కూడా పెంచడం ద్వారా కొంత ఉపశమనం లభిస్తుందని ప్రజలు ఎదురు చూశారన్నారు. కానీ అది నెరవేరలేదన్నారు. ఏదేమైనా ఆదాయపు పన్ను, కొన్ని ఇతర పన్నుల పరంగా యథాతథ స్థితిని కొనసాగించారన్నారు. ఇది మధ్యంతర బడ్జెట్ స్వభావమన్నారు. సాధారణ ఎన్నికల తర్వాత జులైలో కొత్త ఆర్థిక మంత్రి పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమర్పించినప్పుడు.. ఈ వెసలుబాటు కల్పిస్తారని.. పన్ను మినహాయింపుతో సహా మరిన్ని ఆశిస్తున్నామని మీలా జయదేవ్ అన్నారు. మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ను మీలా జయదేవ్ సహా ఎఫ్‌టిసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్, కమిటీ సభ్యులు కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జయదేవ్ మాట్లాడుతూ.. బడ్జెట్‌లో ప్రతిపాదించబడిన గ్రామీణ గృహాలతో సహా వివిధ ప్రతిపాదనలు గ్రామీణ గృహ నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, వ్యవసాయ రంగాలకు ఊతమిచ్చేలా ఉందన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌పై దృష్టి సారించడం, 300 యూనిట్ల వరకు ఉచిత సౌర విద్యుత్‌ను అందించాలనే ప్రణాళికలు స్వాగతించదగినదన్నారు. మధ్యంతర బడ్జెట్ దీర్ఘకాల దృష్టితో రూపొందించబడిందన్నారు.

పెట్టుబడిదారుల్లో విశ్వాసం : ఫిక్కీ ప్రెసిడెంట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచేలా ఉందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ప్రెసిడెంట్ అనిష్ షా పేర్కొన్నారు. ప్రస్తుత పెట్టుబడులు, సామాజిక సాధికారతకు ఇది దోహదం చేస్తుందన్నారు. ఇవి ఈకోసిస్టమ్ విస్తరణకు, పర్యాటక రంగానికి మేలు చేయనుందన్నారు.

ఏడాది పొడవున మార్పులుంటాయి : ఆనంద్ మహీంద్రా

బడ్జెట్‌పై ఎప్పుడూ భారీ ఆశలు పెట్టుకుంటామని.. అయితే భారీ విధాన మార్పులకు బడ్జెట్ ఒక్కటే వేదిక కాదని కార్పొరేట్ దిగ్గజం ఆనంద్ మహీంద్రా అన్నారు. ఇలాంటి మార్పులు ఏడాది పొడవునా ఇతర సందర్భాల్లోనూ ఉంటాయన్నారు. కేంద్ర బడ్జెట్‌ను ఆనంద్ మహీంద్రా స్వాగతించారు. ఎన్నికలకు ముందు బడ్జెట్‌లో ఉండే జనాకర్షక పథకాలకు చోటు కల్పించకపోవడం ప్రశంసనీయమన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కమిషనర్‌కు యూనియన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజనం (ఎండిఎం) పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ కోరింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి యూనియన్ ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి సచివాలయంలో కలిసి గురువారం వినతిపత్రం అందించారు. అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం ఇస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు హామీ ఇచ్చారని, దీనిని ఇప్పటి వరకు అమలు చేయలేదని తెలిపారు. ప్రతినెలా 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని కోరారు. మెనూ ఛార్జీలు రూ.20 ఇవ్వాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులిచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట సమయంలో ప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వాలని తెలిపారు. హైస్కూల్‌లో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలని, సెలవులు మంజూరు చేయాలని కోరారు. మెటర్నిటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ఏడాదికి రెండు జతల యూనిఫాం అందించాలన్నారు. రెండు నెలలకోసారి వర్కర్లతో ఎంఇఒలు సమావేశాలు నిర్వహించి టిఎ, డిఎలు ఇవ్వాలని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో వంట సమయంలో అగ్నిప్రమాదానికి గురై మరణించిన మలిపెద్ది రమాదేవి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని కమిషనరు సురేష్ కుమార్ హామీ ఇచ్చారు.

శిరోముండనం కేసు విచారణ 6 నెలల్లోగా పూర్తి చేయండి

- విశాఖ ప్రత్యేక కోర్టును ఆదేశిస్తూ హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

దళితులకు శిరోముండనం చేశారని పేర్కొంటూ 1996లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతరులపై నమోదైన కేసును ఆరు నెలల్లోగా విచారణ పూర్తి చేయాలని విశాఖలోని ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణ ప్రత్యేక కోర్టును హైకోర్టు ఆదేశించింది. బాధితుల కుల ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, వాళ్ల సాక్ష్యాల నమోదుకు ప్రత్యేక కోర్టు నిరాకరించడం సరికాదని తేల్చింది. ఇది సిఆర్‌పిసి సెక్షన్ 311, ఎస్‌సి, ఎస్‌టి యాక్టుకు వ్యతిరేకమని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పు చెప్పారు.

1996 డిసెంబరు 29న తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం పిఎస్‌లో నాటి టిడిపి ఎమ్మెల్యే త్రిమూర్తులుపై శిరోముండనం కేసు నమోదైంది. అప్పటి నుంచి విశాఖలోని ప్రత్యేక కోర్టులో విచారణ నిలిచిపోయింది. బాధితులైన ఫిర్యాదుదారులు కోటి చిన్నరాజు, డి వెంకటరత్నం కుల ధ్రువీకరణ పత్రాలను సాక్ష్యాలుగా పరిగణనలోకి తీసుకోవాలన్న అభ్యర్థనను విశాఖ ప్రత్యేక కోర్టు 2021 సెప్టెంబరులో తిరస్కరించింది. ఈ చర్యను చిన్నరాజు హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది ఎ సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. కేసులో కీలక వారి కుల ధ్రువీకరణ పత్రాలని, వాటిని విశాఖ కోర్టు విచారణకు స్వీకరించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏళ్ల తర్వాత ఇప్పుడు వాటిని పరిగణనలోకి తీసుకోవాలని కోరడాన్ని నిందితుల తరపున న్యాయవాది వ్యతిరేకించారు. వాదనల తర్వాత హైకోర్టు.. విశాఖ కోర్టు కుల ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోరాదన్న ఉత్తర్వులను రద్దు చేసింది. గరిష్టంగా ఆరు నెలల్లోగా కేసు విచారణ పూర్తి చేయాలని విశాఖ కోర్టును ఆదేశిస్తూ తీర్పు చెప్పింది.

డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన డిఎస్‌సిలో పోస్టుల సంఖ్య పెంచాలని శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. కేవలం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలని మంత్రి మండలి నిర్ణయించడం దారుణమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు మున్సిపల్, సాంఘిక, బిసి సంక్షేమ, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీలను కూడా చేర్చాలని కోరారు. అనేక పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల రెండేళ్ల అప్రెంటీస్ విధానాన్ని 2011లో రద్దు చేశారని తెలిపారు. ఇప్పుడు ఈ విధానాన్ని తెరపైకి తేవటం తిరోగమన చర్య అని, ఈ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో లానే డిఎస్‌సికి వయోపరిమితి 44 ఏళ్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ప్రకాశం, తిరుపతి ఎస్‌పిల బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇద్దరు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రకాశం, తిరుపతి జిల్లాల ఎస్‌పిలను బదిలీ చేస్తూ జిఓ 239ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా ఎస్‌పి మల్లిఖా గర్గ్‌ను తిరుపతి ఎస్‌పిగా, తిరుపతి ఎస్‌పి పి పరమేశ్వర రెడ్డిని ప్రకాశం జిల్లా ఎస్‌పిగా బదిలీ చేశారు.

ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై రేపటికి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : విద్యార్థి కార్యకర్త ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌ను విచారించడంలో జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన సుప్రీం బెంచ్ రెండోసారి విఫలమైంది. గురువారం ఉదయం నుండి ఇడికి సంబంధించిన కేసు విచారణ సాగిస్తున్న బెంచ్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. తనకు రేపు రాజ్యాంగ బెంచ్ ముందు అలీఘర్ ముస్లిం యూనివర్శిటీ మైనారిటీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ వుందని న్యాయవాది కపిల్ సిబల్ చెప్పినప్పటికీ బెంచ్ రేపటికి వాయిదా వేసింది. జనవరి నెలలోనే రెండుసార్లు సుప్రీం బెంచ్ ఇలా వాయిదాలు వేయడంపై ఉమర్ ఖలీద్ విస్మయం వ్యక్తం చేశారు. మొదటగా జనవరి 10న ఈ కేసు విచారణకు రావాల్సి వుంది. ఉభయ పక్షాలు వాయిదాను కోరడంతో జనవరి 24న తుది విచారణ జరుగుతుందంటూ కోర్టు వాయిదా వేసింది. 24న కోర్టుకు భోజన విరామం అనంతరం వేరే కేసు విచారణ వుండడంతో 31కి వాయిదా వేసింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరి 23న చెలరేగిన మత ఘర్షణల వెనుక సూత్రధారుల్లో ఒకరు ఖలీద్ అని ఆరోపిస్తూ ఆ ఏడాది సెప్టెంబరు 13న అరెస్టు చేశారు. రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. రెండో కేసులో బెయిల్ వచ్చినప్పటికీ, మొదటి కేసులో బెయిల్‌ను నిరాకరిస్తూ వస్తున్నారు.

అందమైన భాషతో అబద్ధాలు

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఓట్ ఆన్ అకౌంట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందమైన భాషతో అబద్ధాలు చెప్పారని, సార్వత్రిక ఎన్నికల కోసమే నరేంద్రమోదీ ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. తిరుపతి నగరంలోని గంధమనేని శివయ్య భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉపాధి తప్ప... ఉద్యోగాల గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. పన్నుల వ్యవహారంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి పెద్ద పీట వేసిందన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అయోధ్య అంశాన్ని లేవనెత్తడాన్ని ఆక్షేపించారు. లౌకిక రాజ్యమైన భారతదేశంలో మత కల్లోలాలను సృష్టించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి, పార్లమెంటు భవన్ ప్రారంభోత్సవానికీ ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. త్వరలో ఎన్నికలు జరిగే కేరళ రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్త కన్నా హీనంగా గవర్నర్ ప్రవర్తిస్తున్నారన్నారు. ఓ గవర్నరు ఇలా ప్రవర్తించడం బాధాకరమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అదానికి అప్పగించేందుకు కేంద్రం సిద్ధమయ్యిందన్నారు. కోడి కత్తిశీను ఐదేళ్లుగా విచారణ ఖైదీగా జైలులో ఉన్నప్పటికీ జగన్ సాక్ష్యం చెప్పడానికి వెళ్లక పోవడం బాధాకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, పెంచలయ్య, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధనవంతులను మరింత ధనికులను చేసి పేదలను పీల్చిపిప్పి చేసే బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, 2023 -24 సంవత్సరానికి సవరించిన గణాంకాలు ఆర్థిక వ్యవస్థ వాస్తవిక స్థితిని తెలియజేస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. గత బడ్జెట్ అంచనాతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవిన్యూ రాబడి 13.3 శాతం పెరిగింది. అయినప్పటికీ ద్రవ్యలోటు తగ్గించే పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలపై భారీగా కోత పెట్టింది. ద్రవ్యలోటు తగ్గించుకోడానికి కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని బడ్జెట్ అంచనా కన్నా కిందికి కుదించేసింది. ఈ రంగంలో వ్యయం కేవలం 7 శాతం మాత్రమే పెరిగింది, ప్రభుత్వ వ్యయాన్ని అధికారికంగా చూపిన నామమాత్రపు జిడిపి వద్ధి రేటు 8.9 శాతం కంటే తక్కువే. ఈ వ్యయంలో కోత కారణంగా ప్రజా సంక్షేమానికి సంబంధించిన వివిధ రంగాలపై వ్యయం తగ్గిపోయిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. మూలధన వ్యయం కూడా తగ్గింది. ఇది భవిష్య వృద్ధి, ఆర్థిక మూల సూత్రాలపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

వ్యయంలోని ఈ క్షీణత ఆర్థిక వ్యవస్థ అట్టడుగు స్థాయిని తాకుతోంది. కోత పడిన వాటిలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, నీటిపారుదల, షెడ్యూల్డ్ కులాలు, గిరిజనుల అభివద్ధికి గత బడ్జెట్‌లో ప్రతిపాదించినదాని కంటే తక్కువ ఖర్చు చేశారు. వీటిలో ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన్ మంత్రి గ్రామ్ సడక్ యోజన, పిఎం పోషణ్ వంటి పథకాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు గత కేటాయింపుల కంటే తక్కువగా ఉండటమే కాకుండా 2022-23 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వ్యయం కన్నా తక్కువగా ఉంది.

మహిళా, శిశు సంక్షేమ పథకాల కేటాయింపుల్లో కూడా భారీగా కోత విధించారని పొలిట్‌బ్యూరో విమర్శించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం వ్యయంతో పోలిస్తే పంట, ఎరువుల సబ్సిడీ, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పట్టణాభివద్ధికి కేటాయింపులు తగ్గాయి.

2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీ 60,470 కోట్ల రూపాయలు తగ్గింది. అదే సమయంలో ఎరువులపై సబ్సిడీ రూ.62,445 కోట్లు తగ్గింది. ఉపాధి హామీ పనులకు కేటాయింపు 4806 కోట్ల మేర కోత పడింది. గ్రామీణాభివద్ధి మరియు రాష్ట్రాలకు నిధుల బదలాయింపులో స్తబ్ధత నెలకొంది. నిజానికి దీనిని స్తబ్ధత అనేదానికన్నా పెరిగిన ద్రవ్యోల్బణాన్ని బట్టి చూస్తే తగ్గిందనే చెప్పాలి.జిఎస్‌టి నష్ట పరిహారానికి అనుగుణంగా గతంలో ఇచ్చిన రుణాల కన్నా మూల ధన పెట్టుబడుల కోసం ఇచ్చిన రుణాలు చాలా వరకు కుదించబడ్డాయి. ఇది రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసేందుకు దారి తీస్తుంది.

కంద్ర ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం ఆదాయాన్ని పెంచడం అనే కథనంతో చాలా బలహీనమైన ఆర్థిక వద్ధి చిత్రాన్ని కప్పిపుచ్చడానికి కేంద్రం ప్రయత్నించిందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. 2023-24లో వాస్తవ వద్ధి రేటు 7.3 శాతంగా ఉందని కేంద్రం చెప్పడం పూర్తిగా కల్పితం. పైగా 2023-24లో ద్రవ్యోల్బణం 1.6 శాతం మేర తగ్గిందనేది మరో అసంబద్ధమైన వాదన. ద్రవ్యోల్బణం సూచిక లేదా రిటైల్ మార్కెట్‌లోని వినియోగదారు ధర సూచికను బట్టి చూసినా ఇది ఎంత అవాస్తవికమో తేలిపోతుంది. . గత ఆర్థిక సంవత్సరం వినిమయ ధరల సూచి 6 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 10 శాతం. ఉంది. అధిక ధరలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఫిబ్రవరి 2023 నుంచి రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగించడాన్ని బట్టే భారత దేశంలో ద్రవ్యోల్బణం వాస్తవిక గాథ వెల్లడవుతుంది.

దేశ ఆర్థికాభివద్ధి మందగించినప్పటికీ, నెమ్మది నెమ్మదిగా పెరిగిన ఆదాయ పంపిణీలో బడా పెట్టుబడిదారులు , వ్యాపారవేత్తలు, సంపన్నులకు లబ్ధి చేకూర్చే ఎటువంటి యత్నాన్ని ప్రభుత్వం వదులుకోలేదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం ఈ నిధికి వెళ్తోందని ప్రకటన పేర్కొంది. కార్పొరేట్ పన్ను, ఆదాయపు పన్ను ద్వారా ఆదాయం పెరిగింది. దీనికి కారణం పన్ను రేట్లు పెరగడం కాదు. సంపన్నుల ఆదాయంలో మరింత పెరుగుదల ఫలితంగా జరిగిందే ఇది.

దీన్ని ఆర్థికశాస్త్రంలో ఆంగ్ల అక్షరం 'కె' ఆకారపు వృద్ధితో పోలుస్తారు. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణలో కొద్ది మందిగా ఉన్న కొందరి ఆదాయం వేగంగా పెరుగుతుంది, అదే సమయంలో ఆరుగాల కష్టపడినా వారి బతుకుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం జరుగుతుంది. దీనినే కె ఆకారంపు ఆర్థిక వృద్ధి అంటారు. ఈ అభివద్ధి నమూనాలో, శ్రామిక ప్రజలు సంక్షోభం నేపథ్యంలో తక్కువ వేతనానికి ఎక్కువ పని చేయవలసి వస్తుంది.

అభివృద్ధి ప్రక్రియలో కార్మికులను భాగస్వాములను చేస్తూ నిజమైన 'సామాజిక న్యాయం' సాధిస్తున్నామంటూ మోదీ ప్రభుత్వం ఆర్భాటంగా చేస్తున్న ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ మధ్యంతర బడ్జెట్ బట్టబయలు చేసింది. 'నిజమైన సామాజిక న్యాయం' లేదా అభివద్ధిలో సామాన్య ప్రజలను కలుపుకుపోతున్నామని కేంద్రం చెప్పడం ఎంత బూటకమో ఈ బడ్జెట్ తెలియజేస్తోంది. మోడీ ప్రభుత్వ అభివద్ధి నమూనా వల్ల దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు జీవనోపాధిని కోల్పోగా, కొద్దిమంది లాభాలకు పడగలెత్తుతున్నారని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

తొందరపాటు చర్యలు తగదు

- అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ : జ్ఞానవాపి మసీదు విషయంలో ప్రభుత్వ తొందరపాటు చర్యలను సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ఏ కోర్టు ఆదేశమైనా అమలు చేసేటప్పుడు అనుసరించాల్సిన పూర్తి ప్రక్రియను పాటించలేదని అన్నారు. వారణాసి కోర్టు వారం రోజులు గడువిచ్చినా ఇక్కడ ఏం జరుగుతోంది? మసీదు కమిటీ ఎలాంటి చట్టపరమైన చర్యలు చేపట్టకుండా వుండేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయకుండానే హడావిడిగా అమలు చేస్తున్నారని విమర్శించారు. రామ మందిరం తర్వాత రాబోయే ఎన్నికల నేపథ్యంలో జ్ఞానవాపి మసీదు అంశాన్ని ఉపయోగించుకునేందుకు ఇదొక ప్రయత్నమని విమర్శించారు.

మసీదులో పూజలు !

కోర్టు ఆదేశాల మేరకు 31ఏళ్ల తర్వాత గురువారం మసీదు బేస్‌మెంట్‌లో వ్యాస్ కుటుంబానికి చెందిన పూజారి జితేంద్రనాథ్ వ్యాస్ పూజలు నిర్వహించారు. కాశీ విశ్వనాథ్ ఆలయ ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే ఈ విషయం తెలియజేశారు. కోర్టు ఉత్తర్వులను పాటించేందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేసిందని చెప్పారు. బుధవారం రాత్రి 10.30 గంటలకు సెల్లార్‌ను తెరిచి, పూజలు చేశారు.



ప్రజాశక్తి
www.prajasakti.com



మోసగించడం ఆపండి

- బడ్జెట్‌పై ఐద్వా అసంతృప్తి
- మహిళా సాధికారతపై మోసపూరిత ప్రకటనలని విమర్శ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ పట్ల ఐద్వా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది, ఎన్నికల ముందు ప్రచార పత్రం తప్ప మరొకటి కాదని విమర్శించింది. మహిళా సాధికారతలో విజయాల గురించి ఈ ప్రభుత్వం ఆర్భాటంగా చేస్తున్న ప్రచారాన్ని మహిళల ఉపాధి అవకాశాలు క్షీణించడం, కొనసాగుతున్న ఆర్థిక దుస్థితి, పెరుగుతున్న ఆకలి వంటి వాటిల్లో చూడాలని ఐద్వా పేర్కొంది. ఇవన్నీ కలిసి మహిళల జీవితాల్లో అంతులేని కష్టాలను నింపుతున్నాయని పేర్కొంది. ఆర్థిక మంత్రి వాస్తవిక పరిస్థితులను గమనంలోకి తీసుకోవాలని, మహిళలను మోసం చేయడాన్ని ఆపాలని ఐద్వా కోరింది. 2014-2021 మధ్య కాలంలో మహిళా కార్మికుల ఆత్మహత్యలు 137శాతం పెరిగాయని తెలిపింది. మహిళల సాధికారత అనేది పెట్టుబడులపై కాదని, ఫలితాలపై ఆధారపడి వుంటుందని ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించారని, అంటే దానర్థం మహిళాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు కీలకం కాదని చెప్పకనే చెబుతున్నారని విమర్శించింది. మహిళా లబ్దిదారుల సంఖ్య గణనీయంగా వున్న ఉపాధి హామీ (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) గురించి అసలు ప్రస్తావనే లేదని, ఈ పథకాన్ని మొత్తంగా నిలిపివేయడానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని స్పష్టమవుతోందని ఐద్వా పేర్కొంది. గత బడ్జెట్‌లో ప్రకటించిన బాలికల పొదుపు మొత్తాల పథకం ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. పైగా జన ధన్ పథకంలో మోసాల గురించి కాగ్ బట్టబయలు చేసింది. అటువంటప్పుడు ఈ పథకాల గురించి మహిళా సాధికారత అంటూ ఈ ప్రభుత్వం చేసుకునే ప్రచారం ఏ మాత్రమూ సరికాదని ఐద్వా పేర్కొంది. మహిళా రిజర్వేషన్ బిల్లును, మూడుసార్లు తలాక్ బిల్లును ఆమోదించడాన్ని నారీ శక్తిగా ప్రభుత్వం చెప్పుకుంటోంది. గతంలో వీటిపై ఐద్వా తీవ్రమైన విమర్శలు చేసిందని, ఇకపై కూడా ఈ ప్రభుత్వ మహిళా వ్యతిరేక వైఖరిని బహిర్గతం చేస్తామని తెలిపింది. రాబోయే ఎన్నికల్లో ఈ నిరంకుశ, మనువాదీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజాతంత్ర శక్తులు, మహిళలు ఏకం కావాలని పిలుపునిచ్చింది.

రైతు వ్యతిరేక బడ్జెట్

ఎఐకెఎస్ విమర్శ

న్యూఢిల్లీ : సి2 ప్లస్ 50శాతంతో కనీస మద్దతుధరను ఇచ్చేందుకు చట్టపరమైన హామీ కల్పిస్తూ బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) తీవ్రంగా విమర్శించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామంటూ ఇచ్చిన హామీలు కేవలం ప్రహసనంగా మారాయని విమర్శించింది. మోడీ ప్రభుత్వం వరుసగా పదోసారి రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ సమర్పించిందని ఎఐకెఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజూ కృష్ణన్, డాక్టర్ అశోక్ ధావలె విమర్శించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా చేసిందేమీ లేదన్నారు. 2022-23తో పోలిస్తే 2024-25లో వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలకు చేసిన కేటా యింపులు ఏకంగా రూ.81 వేల కోట్ల మేరకు తగ్గాయ ని విమర్శించారు. చిన్న కమతాల వ్యవసాయాన్ని పూర్తిగా ధ్వంసం చేసేందుకే మోడీ సర్కార్ ప్రయత్ని స్తోందన్నారు. ఎరువులు, ఆహార సబ్సిడీలు గతంతో పోలిస్తే పెద్ద మొత్తంలో తగ్గాయన్నారు. కీలక రంగాల్లో చేసిన కేటాయింపులు చూస్తేనే మోడీ ప్రభుత్వ వైఖరి ఎలా వుందో అర్థమవుతోందన్నారు. అభివృద్ధి చెందా ల్సింది రైతులు కాదు, అదానీ, అంబానీలన్న విషయాన్ని ఈ ప్రభుత్వం తన చర్యలతో స్పష్టం చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ గ్రామీణ బంద్‌ను జయప్రదం చేసేందుకు కృషి చేయాల్సిందిగా ఎఐకెఎస్ తన శాఖలకు పిలుపునిచ్చింది.

ప్రజా వ్యతిరేక బడ్జెట్ : ప్రతిపక్షాలు

ఇది బిజెపి ఫేర్‌వెల్ బడ్జెట్

ఈ బడ్జెట్ బిజెపి ప్రభుత్వ ఫేర్‌వెల్ బడ్జెట్. దశాబ్ద కాలం పాలనలో ప్రజా వ్యతిరేక బడ్జెట్‌లతో బిజెపి ప్రభుత్వం షేమ్‌ఫుల్ రికార్డును సృష్టించింది. ఈ రికార్డు బ్రేక్ కాదు. ఎందుకంటే సానుకూల ప్రభుత్వం ఏర్పాటయ్యే సమయం ఆసన్నమైంది. **- అఖిలేశ్ యాదవ్, మాజీ సిఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత**

ఇది మోడీ సర్కారు చివరి బడ్జెట్

మోడీ సర్కారుకు ఇదే చివరి బడ్జెట్. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేదలు, మహిళలు, యువత, రైతులుపై బడ్జెట్ ఫోకస్ చేస్తుందని చెప్పారు. కనీసం దేశంలో ఆ నాలుగు వర్గాల ప్రజలైనా ఉన్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. **- ఉద్ధవ్ థాక్రే, మాజీ సిఎం, శివసేన (యుబిటి) చీఫ్**

బడ్జెట్ లోపభూయిష్టం

బడ్జెట్ లోపభూయిష్టంగా ఉన్నదని బిజెపి మాజీ మిత్రపక్షం శిరోమణి అకాళీదళ్ (ఎస్ఎడి) ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ అన్నారు. యువత, మహిళలు, రైతుల కోసం బడ్జెట్‌లో ఏమీ లేదని తెలిపారు. జులైలో బడ్జెట్‌ను ప్రవేశపెడతామని వారు (కేంద్రం) చెప్పినపుడు వారిలో అహంకారం కనిపించిందని చెప్పారు. **- ఎస్ఎడి ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్**

ప్రజా వ్యతిరేక బడ్జెట్

కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ విమర్శించారు. దీనితో మోడీ సర్కారు ప్రజా వ్యతిరేక తీరు బయటపడిందని అన్నారు. మోడీ హామీ అయిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు కల్పించారా, లేదా అన్నదానిపై కేంద్ర మంత్రి నిర్మల తెలియజేస్తారని ఆశతో తాము ఎదురు చూశామని తెలిపారు. టాక్స్ స్లాబ్‌ల విషయంలో మధ్య తరగతికి ఊహించిన ఉపశమనం లభించలేదని కమల్‌నాథ్ చెప్పారు. **- కమల్‌నాథ్**

బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్నా

కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్నాను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇచ్చింది. బడ్జెట్‌లో పదేళ్ల అభివృద్ధి గురించి చెప్పారని ఆచరణలో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. పేదరికం తగ్గితే 80కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తారని ప్రశ్నించారు. రుణ వ్యవస్థపై చెప్పిన గణాంకాలు కాకిలెక్కలే అని పేర్కొన్నారు. పన్నుల విధానంలో ఉద్యోగులకు నిరుత్సాహం కలిగించిందని తెలిపారు. **- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

సబ్సిడీలకు కోత

- ఆహారం, గ్యాస్, పెట్రోల్, యూరియా వంటి ఎరువులకు తగ్గిన కేటాయింపులు
- అంగన్‌వాడీల, పంట బీమాకు కోత
- ఉపాధి హామీ, పిఎం కిసాన్‌కు పెంపు లేదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో సామాన్య, పేదలు, రైతులకు సంబంధించిన వాటిపై కేంద్ర ప్రభుత్వం కోత విధించింది. ఆహారం, వంటగ్యాస్, పెట్రోలియం, యూరియా వంటి ఎరువులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గాయి. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో సామాన్య, పేద ప్రజలకు ఎటువంటి ఉపశమనం కలగలేదు. పైగా ఆయా వర్గాలకు సంబంధించిన రంగాల కేటాయింపుల్లో కోత విధించారు. ఆహారానికి సంబంధించి 2022-23 బడ్జెట్‌లో రూ.2,72,802 కోట్లు కేటాయించగా, 2022-23లో దాన్ని రూ.2,12,332 కోట్లకు తగ్గించారు. దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.2,05,250 కోట్లకు తగ్గించారు. ప్రజా పంపిణీకి 2023-24లో రూ.137.36 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.106.73 కోట్లకు తగ్గించారు. గ్యాస్ సబ్సిడీకి 2023-24లో రూ.12,240 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.11,925.01 కోట్లకు తగ్గించారు.



కీలక అంకెలు

(కోట్లలో)

	2022-23 (వాస్తవాలు)	2023-24 (బడ్జెట్ అంచనాలు)	2023-24 (సవరించిన అంచనాలు)	2024-25 (బడ్జెట్ అంచనాలు)
రెవెన్యూ రాబడి	23,83,206	26,32,281	26,99,713	30,01,275
మూలధనదాయం	18,09,951	18,70,816	17,90,773	17,64,494
మొత్తం ఆదాయం	41,93,157	45,03,097	44,90,486	47,65,768
మొత్తం వ్యయం	41,93,157	45,03,097	44,90,486	47,65,768
నికర పెట్టుబడి వ్యయం	10,46,289	13,70,949	12,71,436	14,96,693
రెవెన్యూ లోటు	10,69,926	8,69,855	8,40,527	6,53,383
నికర రెవిన్యూ లోటు	7,63,662	4,99,867	5,19,337	2,67,801
ద్రవ్య లోటు	17,37,755	17,86,816	17,34,773	16,85,494
ప్రాథమిక ఆర్థికలోటు	8,09,238	7,06,845	6,79,346	4,95,054

పెట్రోలియానికి సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.12,240 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.11,925 కోట్లకు తగ్గించారు. రైతులకు సంబంధించిన ముఖ్యమైన ఎరువులకు 2022-23 బడ్జెట్‌లో రూ.2,51,339 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ.1,88,894 కోట్లకు తగ్గించారు. దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.1,64,000 కోట్లకు తగ్గించారు. అందులోనూ యూరియాకు 2022-23 బడ్జెట్‌లో రూ.1,65,217 కోట్లు కేటాయించగా, 2023-24లో దాన్ని రూ.1,31,100 కోట్లకు తగ్గించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.1,19,000 కోట్లకు తగ్గించారు. పంటల బీమా పథకానికి సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.15,000 కోట్లు కేటాయించగా, దాన్ని 2024-25 బడ్జెట్‌లో రూ.14,600 కోట్లకు తగ్గించారు.

నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్ఆర్ హెచ్ఎం)కు కేటాయింపులే లేవు. స్మార్ట్ సిటీలకు 2023-24లో రూ.13,200 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.10,400 కోట్లకు తగ్గించారు. అంగన్‌వాడీలకు 2023-24లో రూ.21,523 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.21,200 కోట్లకు తగ్గించారు. అంటే రూ.323 కోట్లు తగ్గించారు. మహిళా భద్రత పథకాల కేటాయింపుల్లో భారీ కోత విధించారు. 2023-24లో రూ.1,009 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.155 కోట్లకు తగ్గించారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించి 2023-24 బడ్జెట్‌లో రూ.34,354 కోట్లు కేటాయించగా, దాన్ని సవరించిన అంచనాల్లో రూ.32,800 కోట్లకు తగ్గించారు. 2024-25 బడ్జెట్‌లో రూ.31,107 కోట్లకు తగ్గించారు. అంటే రూ.3,247 కోట్లు తగ్గించారు. కోల్ ఇండియా లిమిటెడ్‌కు భారీ కోత పడింది. 2023-24లో రూ.16,500 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.15,500 కోట్లకు తగ్గించారు. ఎన్ఎల్‌సి ఇండియా లిమిటెడ్‌కు 2023-24లో రూ.2,880 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.2,429 కోట్లకు తగ్గించారు.

సాంస్కృతిక పథకాలకు 2023-24లో రూ.808.77 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.520.24 కోట్లకు తగ్గించారు. అకాడమీ, మ్యూజియంలకు బడ్జెట్‌లో కోత విధించారు. అకాడమీలకు సంబంధించి 2023-24లో రూ.435.45 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.389.37 కోట్లకు తగ్గించారు. మ్యూజియంలకు సంబంధించి 2023-24లో రూ.389.40 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.373.70 కోట్లకు తగ్గించారు. పిఎం కిసాన్, ఉపాధి హామీకి ఎటువంటి పెంపుదల లేదు.

అబద్ధాల పుట్ట!

సిఐటియు విమర్శ

న్యూఢిల్లీ : మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అబద్ధాల పుట్ట అని, ప్రైవేటీకరణ కోసం బరి తెగించి చేసిన ప్రయత్నమని సిఐటియు విమర్శించింది. ప్రజల ఆదాయాలు 50శాతం పెరిగాయని, ద్రవ్యోల్బణం ఒక మోస్తరు స్థాయికి చేరుకుందంటూ చెప్పుకోవడం ద్వారా తిరిగి అధికారంలోకి రావడానికి చేసిన ప్రయత్నంగా వుందని పేర్కొంది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటన జారీ చేశారు. నిజానికి వాస్తవిక పరిస్థితులు భిన్నంగా వున్నాయని, నిత్యావసరాల ధరలు పెరుగుతునే వున్నాయని, నిరుద్యోగం పెచ్చరిల్లిందని విమర్శించింది. తమ రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికే పోరాడుతున్న సామాన్యుల్లో విశ్వాసాన్ని పాదుగొల్పడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని విమర్శించింది.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు మోడీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారని, రూ.4.09లక్షల కోట్ల మేరకు ప్రైవేటీకరణ జరిగిందని, దేశ చరిత్రలోనే ఇది అత్యంత ఎక్కువని విమర్శించింది. ఈ సంవత్సరంలో రూ.30 వేల కోట్ల మేరకు పెట్టుబడులను ఉపసంహరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2025లో ఈ లక్ష్యం రూ.50 వేల కోట్లకు పెరిగిందని సిఐటియు పేర్కొంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ప్రైవేటుకు ద్వారాలు తెరిచారని, రూ.లక్ష కోట్లతో కార్పస్‌ను ఏర్పాటు చేశారని విమర్శించింది. వినూత్న ఆవిష్కరణల ముసుగులో ప్రైవేటు రంగానికి 50ఏళ్ల పాటు వడ్డీ లేని రుణాలు అందించేందుకే ఈ చర్యలని పేర్కొంది. రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్యవాదం భావనను సమూలంగా ధ్వంసం చేసేందుకు ఒకపక్క మోడీ సర్కార్ ప్రయత్నిస్తుండగా, మరోవైపు రాబోయే తరం సంస్కరణలు చేపట్టడానికి అవసరమైన బ్లూ ప్రింట్‌ను రాష్ట్రాలతో చర్చించి రూపొందిస్తామని బడ్జెట్‌లో చెప్పడం హాస్యాస్పదంగా వుందని సిఐటియు విమర్శించింది. గత పదేళ్ల మోడీ సర్కార్ పనితీరును చూసినట్లైతే, ఇది కార్మిక, కర్షక, ప్రజా, జాతి వ్యతిరేక ప్రభుత్వమని స్పష్టమవుతోందని తపన్‌సేన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తంగా చూసినట్లైతే కార్మికులు, రైతాంగం, సామాన్యులకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి సానుకూల చర్యలు లేవని విమర్శించారు.

సంయుక్త కిసాన్ మోర్చా, సిటియుల పిలుపు మేరకు ఈ నెల 16న జరగనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా సిఐటియు తన అనుబంధ సంఘాలకు, సభ్యులకు పిలుపునిచ్చింది.

సిపిఎంకు అండదండలు ఇవ్వండి

- రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- తాడేపల్లి, సుందరయ్య నగర్‌లో విరాళాల సేకరణ

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

ప్రజల కోసం పోరాడే సిపిఎంకు అండదండలు ఇవ్వాలని ప్రజలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. సిపిఎం ప్రజానిధి క్యాంపెయిన్‌ను గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్‌లో గురువారం ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావుతో కలిసి ఆయన జోలె పట్టి విరాళాలు సేకరించారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పేదలకు ఇళ్లస్థలాలు, పట్టాలు ఇవ్వాలని రాష్ట్రంలో సిపిఎం పెద్దఎత్తున పోరాడిన సంగతి గుర్తు చేశారు. అంగన్‌వాడీ, మున్సిపల్, ఆశా వర్కర్ల పోరాటాలు ఉవ్వెత్తున సాగాయని తెలిపారు. ఈ పోరాటాలన్నింటికీ సిపిఎం అండగా నిలబడిందని చెప్పారు. ఎన్నడూ లేని విధంగా ఇటీవల పాలకవర్గ పార్టీలు వామపక్ష పార్టీలపై ముఖ్యంగా సిపిఎంపై నిర్బంధం పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందని, మతాన్ని రాజకీయా ల్లో జోడించి ప్రజల మనోభావాలతో ప్రధాని చెలగా టం ఆడుతున్నారని విమర్శించారు. గత పదేళ్ల పాలన లో అన్ని విధాలా విఫలమైన బిజెపిని ప్రజలు తిర స్కరించాలని కోరారు. క్యాంపెయిన్‌లో రాష్ట్ర నాయ కులు పిన్నమనేని మురళీ కృష్ణ, కె.గడ్డెన్న, ఎస్ వెంక ట్రావు, సత్యాజీ, ఒ.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బుల్డోజర్ రాజకీయాలు సాగనివ్వం

రైల్వేబాధితులకు వివిఎస్ ఆర్ పరామర్శ

పేదల ఇళ్లు కూల్చే బుల్డోజర్ రాజకీయాలను ఆంధ్రాలో సాగనివ్వమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం తాడేపల్లిలో రైల్వే స్థలాల్లో ఉంటున్న పేదలను పాశం రామారావు తదితరులతో కలిసి పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైల్వే ట్రాక్‌కు దూరంగా ఉన్న స్థలాల్లో ఏడు దశాబ్దాలుగా పేదలు నివాసం ఉంటున్నారని , రెండు రోజుల్లో ఖాళీ చేయాలని లేకుంటే బుల్డోజర్‌తో కూల్చేస్తామని చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పేదల ఇళ్లకు భరోసా కల్పించాలని, అవసరమైతే రైల్వేకు పరిహారం చెల్లించి, మరేదైనా భూమి కొనుగోలు చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లు తొలగించాలని చూస్తే భవిష్యత్తు కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. పేదలకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు వల్లభనేని వెంకట్రావు భరోసా ఇచ్చారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

జెన్‌కో ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనొద్దు
- థర్మల్ ప్లాంట్లను మెరుగుపరచాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు
- ముగిసిన ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జెన్‌కో ప్లాంట్ల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ సంస్థలకు అడ్డగోలుగా రాయితీలు ఇస్తోందని, ఇది సరైన విధానం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు ఇబ్బడిముబ్బడిగా భూములు కేటాయిస్తూ జెన్‌కో ఆధ్వర్యంలో కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యుత్ సంస్థల ఎఆర్‌ఆర్‌పై సోమవారం నుంచి జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ గురువారంతో ముగిసింది. జెన్‌కో సమర్పించిన బహుళ వార్షిక కాలవ్యవధి 2024-29 నియంత్రణ కాలానికి సంబంధించిన ప్రతిపాదనలపై ఎపిఇఆర్‌సి జస్టిస్ ఛైర్మన్ నాగార్జున రెడ్డి విశాఖపట్నంలోని ఇపిడిసిఎల్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను స్వీకరించారు. ముందుగా జెన్‌కో ప్రతిపాదనలను ఆ సంస్థ ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు వివరించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ.. 4, 5వ నియంత్రణ కాలంలో కొత్త ప్రాజెక్టుల ఏర్పాటు కోసం జెన్‌కోకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. నిధులివ్వకుండా ప్రజల నుంచి వసూలు చేసుకోవాలని చెప్పడం సరికాదన్నారు. ప్రజల డబ్బులతో ఏర్పాటుచేసిన దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌ను ప్రైవేట్‌కు అప్పజెప్పాలని నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. తమ పార్టీతో పాటు, ప్రజలు, విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేయడంతో ప్రైవేటీకరణ ఆగిందన్నారు. థర్మల్ ప్లాంట్లకు కావాల్సిన బొగ్గు కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజకీయపరంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డి మాండ్ చేశారు. కృత్రిమ బొగ్గు కొరత సృష్టించి ధరలు పెంచారని, దీనివల్ల వినియోగదారులపై ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ వంటి భారాలు పడుతున్నాయని చెప్పారు. బొగ్గు కొరతతో వర్షాకాలంలో సైతం కరెంటు కోతలు నెలకొన్న పరిస్థితులు ఉన్నాయని అన్నారు. బొగ్గు, గ్యాస్ సరఫరాలపై కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత విస్మరించి కేంద్రానికి లొంగిపోయిందని విమర్శించారు. థర్మల్ ప్లాంట్ల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కొత్త ప్లాంట్లు ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి బొగ్గు గనులు కేటాయించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను మెరుగుపరచాలని, జెన్‌కో బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జెన్‌కోను బలపరిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని, విద్యుత్ రంగం మెరుగుపడుతుందని అన్నారు. విద్యుత్ రంగ నిపుణులు ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ.. జెన్‌కో ప్లాంట్లలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను కాకుండా డిస్కంలు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాయని చెప్పారు. నాలుగేళ్ల నుంచి వేల మిలియన్ యూనిట్ల (ఎంయు) విద్యుత్ మిగులుగా చూపుతున్నారని తెలిపారు. మెరిట్ ఆర్డర్ అంటూ ప్లాంట్లలో ఉత్పత్తి తగ్గిస్తున్నారని, జెన్‌కోపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వినియోగదారులపై భారాలు పడే ఈ అంశాలను సరిదిద్దుకోవాలని చెప్పారు. మార్కెట్ నుంచి వేల కోట్లు చెల్లించి ముందుగానే చెల్లిస్తున్న డిస్కంలు.. జెన్‌కోకు మాత్రం చెల్లించడం లేదన్నారు. కొత్త ప్రాజెక్టులు నెలకొల్పి జెన్‌కో సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంలో చిన్నచూపు కనపడుతోందని విమర్శించారు. విద్యుత్ సంస్థల తరపున ఇపిడిసిఎల్ సిజిఎం డి సుమాన్ కళ్యాణి అభిప్రాయాలు తెలిపారు.

అభ్యంతరాలు పరిశీలిస్తాం

ఛైర్మన్ నాగార్జున రెడ్డి

ప్రజాభిప్రాయ సేకరణలో కమిషన్ పరిధిలో లేవనెత్తిన అంశాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని ఛైర్మన్ నాగార్జున రెడ్డి చెప్పారు. పరిధిలో లేని వాటిని కూడా సంబంధిత అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తామన్నారు.

విశాఖ టెస్ట్ నేటినుంచే..

- భారత్-ఇంగ్లండ్ ఢీ అంటే ఢీ..
- అరంగేట్రానికి సర్ఫరాజ్, పటీధర్ ఎదురుచూపు
- ఉ.9.30గం॥ల నుంచి



విశాఖపట్నం: విశాఖపట్నంలో క్రికెట్ సందడి నెలకొంది. చాలాకాలం తర్వాత ఈ మైదానంలో ఓ టెస్ట్ జరుగుతుండడమే ఇందుకు ప్రధాన కారణం. డాక్టర్ వైఎస్సార్ స్టేడియం వేదికగా భారత్-ఇంగ్లండ్ మధ్య రెండో టెస్టు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. మరోవైపు.. మంగళవారమే నగరానికి చేరుకున్న ఇరు జట్ల ఆటగాళ్లు ప్రాక్టీస్ మొదలుపెట్టారు. కాగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ టీమిండియా మీద 28 పరుగుల తేడాతో గెలిచింది. ఈ క్రమంలో విశాఖలో విజయం సాధించి 1-1తో సమం చేయాలని టీమిండియా పట్టుదలగా ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దష్ట్యా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఇప్పటికే జట్టుకు దూరం కాగా.. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ గాయాల వల్ల విశాఖ టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు. ఈ క్రమంలో సర్ఫరాజ్ ఖాన్, సౌరభ్ కుమార్, వాషింగ్టన్ సుందర్‌లను జట్టులో చేర్చింది బిసిసిఐ.

ఓటమెరుగని రికార్డు..

అయితే విశాఖ గడ్డపై టీమిండియాకు తిరుగులేదు. ఈ మైదానంలో ఆడిన రెండు మ్యాచుల్లో టీమిండియా విజయం సాధించింది. ఇంగ్లండ్‌తో 2016లో ఒక మ్యాచ్ ఆడగా.. భారత్ 246 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఆ మ్యాచ్‌లో అప్పటి కెప్టెన్ విరాట్ కోహ్లీ(161, 81) రెండు ఇన్నింగ్స్‌ల్లో సత్తా చాటాడు. అశ్విన్ (5, 3) 8 వికెట్లతో రాణించాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో 2019లో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ రెండు ఇన్నింగ్స్‌ల్లో శతకాలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా భారీ విజయాన్ని అందుకుంది. ఈ క్రమంలోనే విశాఖ గడ్డపై టీమిండియాకు తిరుగులేదని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.

పిచ్ రిపోర్ట్..

ఈ పిచ్ తొలుత బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. అలాగే మ్యాచ్ సాగుతున్నా కొద్దీ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తోంది. ఇప్పటి వరకు ఇక్కడ రెండు టెస్ట్‌లు జరగ్గా.. స్పిన్నర్లు 36.04 సగటుతో 47 వికెట్లు తీసారు. పేసర్లు 32.86 యావరేజ్‌తో 23 వికెట్లు పడగొట్టారు. రెండుసార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన జట్లే గెలిచాయి. ఇక్కడ యావరేజ్‌గా తొలి ఇన్నింగ్స్ స్కోర్ 479గా ఉంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది.

ఇంగ్లండ్ తరఫున షోయబ్ అరంగేట్రం..

టీమిండియాతో రెండో టెస్టుకు ఇంగ్లండ్ తమ తుదిజట్టును ప్రకటించింది. శుక్రవారం మొదలుకానున్న ఈ మ్యాచ్‌లో యువ స్పిన్నర్ షోయబ్ బషీర్ అరంగేట్రం చేయనున్నట్లు వెల్లడించింది. జాక్ లీచ్ స్థానంలో అతడిని ఎంపిక చేసినట్లు తెలిపింది. అదే విధంగా మార్క్‌వుడ్‌ని తప్పించి.. అతడి స్థానంలో దిగ్గజ పేసర్ జేమ్స్ ఆండర్సన్‌ను జట్టులోకి తీసుకువచ్చింది మేనేజ్‌మెంట్. ఈ మ్యాచ్‌లో తాము ఈ మేరకు రెండు మార్పులతో బరిలోకి దిగనున్నట్లు తెలిపింది. కాగా తొలి టెస్టులో మార్క్‌వుడ్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. మరోవైపు.. హైదరాబాద్ టెస్టు సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో జాక్ లీచ్ మోకాలికి గాయమైన విషయం తెలిసిందే. దీంతో బుధవారం జరిగిన ట్రెయినింగ్ సెషన్‌లో అతడు పాల్గొనలేదు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతడికి విశ్రాంతినిచ్చిన సెలక్టర్లు బషీర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ఇంగ్లండ్: బెన్ స్టోక్స్(కెప్టెన్), డకెట్, క్రాలే, రూట్, పోప్, బెయిర్‌స్టో, ఫోక్స్, రెహాన్ అహ్మద్, హార్ట్‌లీ, షోయబ్ బషీర్, ఆండర్సన్.

ఇండియా: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, జైస్వాల్, శ్రేయస్, శ్రీకర్ భరత్(వికెట్ కీపర్), అశ్విన్, అక్షర్, సిరాజ్/ముఖేష్, బుమ్రా, రజత్ పటీధర్, సుందర్/సర్ఫరాజ్ ఖాన్.

సెమీస్ బెర్త్ లక్ష్యంగా...

నేడు నేపాల్‌తో చివరి సూపర్-6మ్యాచ్

ఐసిసి అండర-19 వన్డే ప్రపంచకప్

జొహన్నెస్‌బర్గ్: ఐసిసి(అండర్-19) వన్డే ప్రపంచకప్‌లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తోన్న భారత యువజట్టు నేపాల్‌తో చివరి సూపర్-6 మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే సమీకరణాలతో నిమిత్తం లేకుండా నేరుగా సెమీస్‌కు చేరనుంది. గ్రూప్-ఎలో ఆడి మూడు మ్యాచుల్లో ఘన విజయాలను నమోదు చేసుకున్న యువ జట్టు.. మంగళవారం జరిగిన తొలి సూపర్-6 మ్యాచ్‌లో న్యూజిలాండ్ యువ జట్టుపై ఏకంగా 214 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో గ్రూప్-డిలో మూడో స్థానంలో నిలిచి సూపర్-6కు చేరిన పసికూన నేపాల్‌తో శుక్రవారం మ్యాచ్ ఆడనుంది. ఇక టీమిండియా విషయానికొస్తే.. యువ క్రికెటర్లు ఆదర్శ్ సింగ్, ప్రియాన్షు, కెప్టెన్ సహారన్, ముషీర్ ఖాన్ బ్యాటింగ్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్నారు. ముషీర్ ఖాన్ న్యూజిలాండ్‌తో తొలి సూపర్-6 మ్యాచ్‌లో భారీ శతకంతో చెలరేగాడు. మరోవైపు సౌమీ కుమార్, రాజ్ లింబనీ, నమన్ తివారి బౌలింగ్‌లో చెలరేగుతున్నారు.

క్వార్టర్స్‌కు ట్రీసా-గాయత్రి

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి భారతజంట ట్రీసా జోలీ-గాయత్రీ గోపీచంద్ ప్రవేశించింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రి క్వార్టర్స్‌ఫైనల్లో ట్రీసా జోలీ-గాయత్రి జంట 21-15, 24-22తో భారత్‌కే చెందిన తానీషా క్రాస్టో-అశ్విని పొన్నప్పలను చిత్తుచేశారు. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. ప్రి క్వార్టర్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 9-21, 21-12, 17-21తో భారత్‌కే చెందిన యువ షట్లర్ మిథున్ మంజునాథ్ చేతిలో ఓడాడు. మరో పోటీలో ముత్తుస్వామి సుబ్రహనియన్ 9-21, 11-21తో చైనీస్ తైపీకి చెందిన లిన్-చౌన్-లి చేతిలో వరుససెట్లలో ఓడాడు. ఇక మహిళల సింగిల్స్‌లో యువ షట్లర్ అస్మిత ఛాలిహా జోరు కొనసాగుతోంది. ప్రి క్వార్టర్స్‌లో ఛాలిహా 21-12, 15-21, 21-17తో చైనీస్ తైపీకి చెందిన పి-యు-పోను ఓడించి క్వార్టర్స్‌కు చేరింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68